


రాయల్ జర్నలిజం
RNI : APBIL/2023/86665
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM


గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 165 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | శనివారం 6 జూలై 2024 | పేజీలు : 8 వెల :రూ 2-00
GUNTUR | VOL-01 | ISSUE - 165 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 6 SATURDAY JUNE 2024 | PAGES : 8 | Rs :2-00

# ఎర్రచందనం స్మగ్లింగ్ వ్యవహారంలో పెద్ద తలకాయలను పట్టుకోవాలి



అమరావతి: అరుదైన ఎర్రచందనాన్ని విదేశాలకు అక్రమంగా తరలిస్తున్న వ్యవహారంలో పెద్ద తలకాయలను పట్టుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధానికి నిఘా వ్యవస్థను పటిష్టపరచాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. కడప జిల్లా పోట్లదుర్తి జగనన్న కాలనీలో ఎర్రచందనం డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 158 దుంగలు దొరికాయని, వాటి విలువ రూ. 1.6కోట్లు ఉంటుందని అధికారులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. శేషాచలం అడవుల్లో నరికేసిన ఎర్రచందనం దుంగలను ఎక్కడెక్కడ దాచారో గుర్తించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఎర్రచందనం స్మగ్లర్ల నెట్‌వర్క్‌ను నడిపిస్తున్న సూత్రధారులను పట్టుకోవాలని నిర్దేశించారు. రవాణా దశలో, దాచి ఉంచిన దగ్గరో పట్టుకోవడంతో పాటు ఎర్రచందనం కూలీలు, రవాణా దారులను తెరవెనుక ఉండి నడిపిస్తున్నవాళ్లను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలపై చర్చించారు. నమోదైన కేసుల్లో ఎన్నింటిలో శిక్షలు పడ్డాయో, ఎన్ని కేసులు వీగిపోయాయో వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాలు, నేపాల్‌లో పట్టుబడ్డ కేసుల్లో అక్కడ ఉండిపోయిన ఎర్రచందనం దుంగలను తిరిగి తెచ్చుకోవడంపైనా దృష్టి పెట్టాలన్నారు.

# నీట్-పీజీ పరీక్ష షెడ్యూల్ విడుదల.. రెండు షిఫ్టుల్లో నిర్వహణ




దిల్లీ: దేశంలో వైద్యవిద్య పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరేందుకు నీట్-పీజీ 2024 ( పరీక్ష తేదీ ఖరారైంది. ఆగస్టు 11న పరీక్ష నిర్వహించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్ణయించింది. రెండు షిఫ్టుల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్ష నిర్వహించబోతున్నట్లు స్పష్టం చేసింది. నీట్ యూజీ-2024 పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా వివాదం నెలకొన్న వేళ జూన్ 23న జరగాల్సిన నీట్ పీజీ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు పరీక్షకు ఒక రోజు ముందు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా రివైజ్డ్ షెడ్యూల్‌ను ప్రకటించారు. గత ఏడేళ్లుగా నీట్ పీజీ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (%చీదీజుమీ%) నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు పేపర్ లీకేజీ ఆరోపణలు రాలేదు. అయితే, నీట్-యూజీ 2024 పరీక్షపై దేశ వ్యాప్తంగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం కావడంతో, ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా నీట్ పీజీ పరీక్షను కేంద్రం వాయిదా వేసింది. ఆన్‌లైన్‌లో నిర్వహించబోయే నీట్-పీజీకి కేవలం 2 గంటల ముందు ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసి పరీక్ష కేంద్రాలకు పంపించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా ఇటీవల కథనం వెల్లడించింది.

# ఎమ్మెల్సీలుగా సి.రామచంద్రయ్య, పి.హరిప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక



అమరావతి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా సి.రామచంద్రయ్య, పి.హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఇద్దరి నుంచి మాత్రమే నామినేషన్లు రావడంతో ఎన్నిక ఏకగ్రీవమైందని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎమ్మెల్సీలుగా ఉన్న సి.రామచంద్రయ్య, షేక్ మహ్మద్ ఇక్బాల్ వైకాపాకు రాజీనామా చేసి తెదేపాలో చేరారు. వారిలో ఇక్బాల్ ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేయగా, రామచంద్రయ్యపై అనర్హత వేటు పడింది. దాంతో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలు ప్రస్తుతం ఉప ఎన్నికలు లేకుండానే ఏకగ్రీవమయ్యాయి. తెదేపా సీనియర్ నేత సి.రామచంద్రయ్యకు ఎన్డీఏ కూటమి మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. మరో స్థానాన్ని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రాజకీయ కార్యదర్శిగా ఉన్న పి.హరిప్రసాద్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. శాసనసభలో ఎన్డీఏ కూటమికి ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా ఎమ్మెల్సీలుగా వారిద్దరి ఎన్నిక లాంఛనంగా పూర్తయింది.

# డెవిల్‌ను నియంత్రించాం.. ఇకపై ఎవరికీ ఇబ్బంది ఉండదు: చంద్రబాబు



దిల్లీ: ఐదేళ్ల పాటు రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండ్రోజుల దిల్లీ పర్యటన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్ల జగన్ పాలనతో సరిదిద్దలేనంత నష్టం జరిగిందన్నారు. "దక్షిణాదిలో ఏ రాష్ట్రానికీ లేని గొప్ప వనరులు ఏపీకి ఉన్నాయి. నదుల అనుసం ధానంతో అద్భుతాలు సాధించవచ్చు. గోదావరి నుంచే మొత్తం దక్షిణాది రాష్ట్రాలకు నీరు ఇవ్వొచ్చు. కేంద్రం నుంచి ఎలాంటి పదవు ఓలూ ఆశించలేదు. వాజ్‌పేయీ ప్రభుత్వంలోనూ పదవులు ఆశించలేదు. ఏడు మంత్రి పదవులు తీసుకోవాలని వాజ్‌పేయీ కోరినా అంగీకరించలేదు. ఎన్డీయే ఉన్నందున అప్పుడు స్పీకర్ పదవి తీసుకున్నాం. ఇప్పుడు కూడా ఎన్డీయే ఇచ్చిన రెండు మంత్రి పదవులతో సంతోషంగానే ఉన్నాం. జగన్ పాలనతో అమరావతిపై జనాకర్షణ కొంత తగ్గింది. రాజధానికి పూర్వ వైభవం తేవడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అక్కడ 135 ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకానున్నాయి. రాజధానికి అవసరమైన మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నాం. అమరావతిలో ఐకానిక్ బిల్డింగ్ సహా అన్నీ పూర్తి చేస్తాం. తొలుత నిర్మాణంలో ఉన్నవాటికి ప్రాధాన్యత ఇస్తాం. రాష్ట్రం లో కులగణన స్థానంలో నైపుణ్య గణన చేస్తాం. నైపుణ్య గణనకు త్వరలో మార్గదర్శకాలు విడుదల చేస్తాం. మానవ వనరులే పెట్టుబ డిగా సంపద సృష్టిస్తాం. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో ఉపాధి కల్పిస్తాం. పీపీపీ నమూనా స్థానంలో పీ-4 విధానం తెస్తాం. దావోస్ పెట్టుబడుల సదస్సుకు తప్పకుండా హాజరవుతా. మళ్లీ జగన్ వస్తే ఎలా అని అన్ని వర్గాలూ అడుగుతున్నాయి. డెవిల్‌ను నియంత్రించాం.. ఇకపై ఎవరీ ఇబ్బంది ఉండదు" అని చంద్రబాబు తెలిపారు.

# కృష్ణాడెల్టాకు సాగునీరివ్వడం ఆగస్టు వరకు సాధ్యం కాదు: మంత్రి నిమ్మల

అమరావతి: కృష్ణా డెల్టా ఆయకట్టుకు సాగునీరివ్వడం ఆగస్టు వరకు సాధ్యం కాదని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఇరిగేషన్ అధికారులతో సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. "పులిచింతల ప్రాజెక్టులో గతంలో 40 టీఎంసీలు నిల్వ ఉంచుకొని వాడుకునే వాళ్లం. ప్రస్తుతం పులిచింతలలో అర టీఎంసీ కూడా లేదు. పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు కొంచెం తాగు, సాగునీరు ఇవ్వగలుగుతున్నాం. ఐదేళ్లుగా నిర్వహణ సరిగా లేక పట్టిసీమ మోటార్లు పనిచేయడం లేదు. జగన్ పరిపాలన వల్ల జలవనరులశాఖ బాగా నష్టపోయింది. అసమర్థ పాలన వల్ల సాగునీటి ప్రాజెక్టులు 20 ఏళ్లు వెనక్కి వెళ్లాయి. పెండింగ్ ప్రాజెక్టుల పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం."ఈవీఎం బద్దలు కొట్టడం తప్పు కాదని జగన్ మాట్లాడటం దారుణం. ఈవీఎంలను బద్దలు కొట్టడమంటే ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడమే. ఈవీఎంలను ధ్వంసం చేసిన నిందితుడి తప్పేమీ లేదని జగన్




చేసిన వ్యాఖ్యలపై ఈసీ సుమోటోగా కేసు పెట్టాలని కోరుతున్నాం. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోకుండా ప్రజలనే తప్పు పడుతున్నారు. జగన్ ఇలాగే ఉంటే మొన్న మూడంకెల్లో రెండే మిగిలాయి. భవిష్యత్తులో రెండు నుంచి ఒక సంఖ్య మాత్రమే మిగులుతుంది" అని వ్యాఖ్యానించారు.

# వైకాపా ప్రభుత్వం అసెంబ్లీ భవనాలకు సున్నం కూడా వేయలేదు



అమరావతి: ఐదేళ్లు పాలించిన వైకాపా ప్రభుత్వం అసెంబ్లీ భవనాలకు కనీసం సున్నం కూడా వేయలేదని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు విమర్శించారు. అమరావతిలోని ఎమ్మెల్యేల క్వార్టర్స్, అసెంబ్లీ పరిసరాలను ఆయన పరిశీలించారు. స్పీకర్ వెంట ఎమ్మెల్యేలు శ్రావణ్ కుమార్, విష్ణుకుమార్ రాజు, అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ స్పీకర్ హోదాలో నిర్మాణ దశలో ఉన్న ఎమ్మెల్యేల క్వార్టర్లను పరిశీలించినట్టు చెప్పారు. 2014-19 మధ్య ఈ భవనాల నిర్మాణం వేగంగా జరిగిందన్నారు. వైకాపా పాలనలో నిర్మాణాలు ఒక్క అంగుళం కూడా ముందుకు పడలేదని విమర్శించారు. నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ కూడా దొంగలించారని ఆరోపించారు. వీటిని పూర్తిచేయడానికి రూ. 380 కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. రాబోయే 9 నెలల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్ పూర్తయ్యే విధంగా చూడాలని కోరామన్నారు. మిగిలిన రాష్ట్రాల్లో ఇటువంటి రాజధాని ఎక్కడా లేదని.. అధికారులు సహకరించి నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని సూచించారు.

# శ్రీవారి ఆభరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: భానుప్రకాశ్ రెడ్డి



తిరుమల: ప్రపంచ హిందూ ధార్మిక క్షేత్రమైన తిరుమలను వైకాపా ప్రభుత్వం అధర్మ క్షేత్రంగా మార్చిందని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. దర్శన టికెట్లు, లడ్డూ ప్రసాదాలు, ఇంజినీరింగ్ పనులంటిన్నింటిలోనూ అవినీతి చేశారని విమర్శించారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తితిదేలో శ్రీవారి ఆభరణాలు భద్రమేనా? అనే అనుమానాలు భక్తులకు ఉన్నాయన్నారు. వైకాపా హయాంలో రూ. వందల కోట్లు కమిషన్ల రూపంలో దండుకున్నారని ధ్వజమెత్తారు. శ్రీవారి ఆభరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కమిటీ వేసి విచారణ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో తితిదే ఛైర్మన్‌గా పనిచేసిన భూమన కరుణాకరరెడ్డిపై తమకు నమ్మకం లేదని భానుప్రకాశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఏపీలో పెట్టుబడులకు రాజమార్గం..

## యూఏఈ సంస్థతో పెట్టుబడులపై చర్చలు!



అమరావతి :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే ఏపీలోని అమరావతిలో పెట్టుబడులు పెట్టడానికి దేశంలోనే అతి పురాతన బిజినెస్ స్కూల్ ఎక్స్ ఎల్ ఆర్ ఐ 250 కోట్ల బడ్జెట్ తో క్యాంపస్ ఏర్పాటు చేయడానికి రంగంలోకి దిగగా, ఇక తాజాగా ఏపీలోని మెడికల్ సెక్టార్ కు ఊతమిచ్చే విధంగా ఒక మెడ్ టెక్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. యూఏఈకి చెందిన %వీ%42 కంపెనీ త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వంతో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకోబోతుందని ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఒప్పందం ప్రకారం మూడు ఎకనామిక్ కారిడార్లలో పెట్టుబడులు, 9 మునిసిపాలిటీలలో హెల్త్ హబ్స్ నిర్మాణం, అమరావతి హెల్త్ సిటీ లో పెట్టుబడులకు అవకాశం ఉన్నట్టుగా కనిపిస్తుంది. ఈ మేరకు ఏపీఐఐసీ టవర్స్ లోని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో అబుదాబికి చెందిన ఎం 42 సంస్థ ప్రతినిధులతో సమావేశమై చర్చలు జరిపారు. ఏపీలో బల్క్ డ్రగ్ పార్క్ మొదటి స్థానంలో ఉన్నవిషయాన్ని, అలాగే సుమారు 170 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎపి మెడ్ టెక్ జోన్, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 3 ఎకనమిక్ జోన్లలో పెట్టుబడులు పెట్టేందుకు మెండుగా ఉన్న అవకాశాలపైనా వారితో చర్చించామన్నారు. ఆసుపత్రుల నిర్మాణాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహాన్ని కనబర్చడమే కాకుండా ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చే సరికొత్త టెక్నాలజీ అయిన జీనోమ్ సీక్వెన్సీ గురించి ఈ సందర్భంగా ప్రస్తావనకొచ్చిందన్నారు. ఎకనమిక్ కారిడార్లు, మెడ్ టెక్ జోన్ లలో ఎంఎఫ్2 ప్రతినిధులు క్షేత్ర స్థాయి పర్యటన చేశాక సంబంధిత అధికారులతో కూలంకషంగా చర్చించిన మీదట తుది నివేదికను అందజేస్తారన్నారు. పలు దఫాలుగా సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యాక రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాన్ని అందజేస్తామని సంస్థ ప్రతినిధులకు చెప్పామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తామని, అవసరమైన రాయితీల్ని కూడా ఇస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పెట్టుబడిదారులు సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు.

# వైఎస్ జగన్‌లో ఉన్న ప్రత్యేక లక్షణం ఇదే..



అమరావతి : ఏపీ మాజీ సీఎం వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి నుండి నేర్చుకోవాల్సింది చాలా ఉంది.. ఆయనలో ఒక మంచి గొప్ప లక్షణం ఉంది. ఆ గొప్ప లక్షణమే ఇప్పుడు ప్రతి ఒక్కరికి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై ఆసక్తిని కలిగిస్తుంది. అసలు ఇంతకీ వైయస్ జగన్ లో ఉన్న గొప్ప లక్షణం ఏమిటి? ఎందుకు ఆయన గురించి ఇంత ప్రత్యేకంగా చెబుతున్నాము అంటే..తాజాగా ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ పార్టీ నుంచి వెళ్లిపోవాలని అనుకునే వారి గురించి చేసిన వ్యాఖ్యలే ఆయనలో ఉన్న గొప్ప లక్షణానికి నిదర్శనం. పార్టీ నుంచి వెళ్లిపోవాలనుకునే వారు వెళ్ళిపోవచ్చు అని తాను ఎవరిని బ్రతిమాలబోనని, వెళ్లిపోవాలనుకుంటే ఎప్పుడైనా వెళ్లవచ్చుని పార్టీ నేతలకు చాలా లిబర్టీ ఇచ్చారు. వెళ్లిపోయే వారి గురించి చెబితే నేనేం చేస్తాను అంటూ పేర్కొన్న ఆయన, నేను ఆపితే మాత్రం ఉంటారా.. ఇక్కడొక కాలు అక్కడొక కాలు ఎందుకు.. వెళ్లే వాళ్ళు ఎంతటి వారైనా సరే నేను ఆపను.. వాళ్ళు నాకు చెప్పాల్సిన అవసరం కూడా లేదు అంటూ... చేసిన వ్యాఖ్యలే వైయఌ జగన్ లోని గొప్ప లక్షణాన్ని చెబుతున్నాయి. సహజంగా ఎక్కడైనా పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ నుండి నేతలు వెళ్ళిపోతుంటే అధినేతలు నేతలను ఆపే ప్రయత్నం చేస్తారు. అంతేకాదు వారిని పిలిచి మాట్లాడి పార్టీలోనే ఉండేలా బుజ్జగించే ప్రయత్నం కూడా చేస్తారు. కానీ జగన్ మాత్రం అందుకు భిన్నంగా వెళ్ళిపోయే వాళ్ళందరినీ వెళ్లిపోమంటూ చెప్పడం, ప్రజలు తమకు మద్దతుగా ఉంటారని చెప్పడం జగన్ లోని గొప్ప లక్షణం. పార్టీని ప్రారంభించిన నాడు తాను తన తల్లి మాత్రమే పార్టీని ప్రారంభించామని గుర్తు చేసిన జగన్ తాను పార్టీని ప్రారంభించిన నాడు ఎవరూ లేరని ఆ తర్వాత అందరూ వచ్చారని ఇప్పుడు వీళ్లు వెళ్లిపోతే కూడా తన పార్టీ ఆగిపోదని చెప్పే ప్రయత్నం చేశారు, అధికారంలో లేకపో యినా, టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతిపక్షహోదా ఇవ్వకపోయినా, పార్టీ నుంచి నేతలు వలసలబాట పట్టిన జగన్లో ఉన్న కాన్ఫిడెన్స్ ఆయనలోని గొప్ప లక్షణం అని చెప్పాలి. రాజకీయాలలో ఒడిదుడుకులు సహజమని, గెలుపోటములు సహజమని ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా ఓటమి బాధతో కృంగిపోకుండా పార్టీని ముందుకు నడిపిస్తామని జగన్ చెప్పారు. ఇక వైసిపి నేతలు వరుస షాకులు ఇస్తున్నా తనదైన పందాలో పార్టీని ముందుకు నడిపిం చేందుకు జగన్ సిద్ధమయ్యారు. పోరాటం తనకు కొత్తేమీ కాదని చెప్పిన జగన్ మళ్లీ ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తామని తేల్చి చెప్పారు. ఇదే వైయస్ జగన్ లో ఉన్న గొప్ప లక్షణం అని వైసిపి అభిమానులు చెబుతున్నారు. జగన్మోహన్ రెడ్డి ని చూసి చాలామంది రాజకీయ నాయకులు నేర్చుకోవలసిన విషయం ఇదేనని చెబుతున్నారు.

# ఉప్పొంగిన ఉత్సాహం, ఉవ్వెత్తున ఎగసిన అభిమానంతో ద్విచక్ర వాహనాల ర్యాలీ

## ఘనంగా టీడీపీ కార్యకర్తల బైక్ ర్యాలీ




రాయల్ జర్నలిజం, (వాల్మీకిపురం),జూన్ 5:తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలో భారీ మెజార్టీ దిశగా గెలుపొందడంతో శాసన సభ్యులు హెూదాలో తొలి సారి వాల్మీకి పురం రావడంతోఉప్పొంగిన ఉత్సాహం, ఉవ్వెత్తున ఎగసిన అభిమానంతో ద్విచక్ర వాహనాలతో వాల్మీకి పురం మండలం గండబోయినపల్లె నుండి వాల్మీకి పురం రైతు మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ చేపట్టిన టీడీపీ, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు నల్లారి అభిమానులతో మూడు గంటల పాటు కొనసాగింది.అడుగడుగునా బాణ సంచాలు, బాజా భజంత్రీలు, మహిళల హారతులు,పూల మాలలతో ముంచెత్తారు.అనంతరం వాల్మీకి పురం రైతు మార్కెట్ యార్డులో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ భూ అక్రమాలు, అక్రమ ఇసుక రవాణా, మట్టి మాఫియా, మైన్స్, వైన్స్ లాంటి, అక్రమ సొమ్ముతో నన్ను ఓడించడానికి ఎన్నో ప్రయత్నాలు, ఎన్నో ఎత్తులు వేశారని, ఆ ఎత్తులన్నిటిని ప్రజలు చిత్తు చేశారని, ప్రజాభిమానం ముందు అక్రమ సొమ్ము పనిచేయదని,అభివృద్ధిని అక్రమాలకు తెర లేపారని అన్నారు. ఇదే వాల్మీకి పురంలోని మండలంలోని మా కుటుంబ సభ్యులు, అభిమానులు ప్రచారం చేస్తుంటే ధైర్యంగా ఎదుర్కోలేక ఓర్చుకోలేని సన్నాసులు తమ వెకిలి చేష్టలతో ప్రచార వాహనాన్ని నిప్పు పెట్టి భయపెట్టాలని చూశారని, వాహన చోదకుడు తీవ్రంగా గాయపడ్డాడని గుర్తు చేశారు.1962నుండి రాజకీయాలు చేస్తున్నాము. ఇప్పటికి 15 సార్లు పోటీచేశామని మీ లాగా స్వార్థ రాజకీయాలు నల్లారి కుటుంబం ఇంటా వంటా లేదని అన్నారు. స్వార్థ రాజకీయాలకు చరమ గీతం పాడుదాం స్వచ్ఛ మైన రాజకీయాలు చేద్దాం నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడాలని కూటమి కార్యకర్తలకు పిలుపునిచ్చారు.నన్ను ఆశీర్వదించి, శాసనసభ్యులుగా గెలిపించిన మీకు, మీ కుటుంబ సభ్యులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి ప్రతి కార్యకర్త సమస్యకుపరిష్కారమార్గం చూపిస్తానని, ఈ గెలుపు నాది కాదని మీ అందరిదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ,బిజెపి,జనసేన శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు, నల్లారి అభిమానులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డెంగ్యూ మరియు అతిసారం పైన చరవాండ్లపల్లిలో అవగాహన



రాయల్ జర్నలిజం,(వాల్మీకిపురం) జూన్ 5:వాల్మీకిపురం మండలం చింతపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య చరావాండ్లపల్లి నందు ప్రజలకు డెంగ్యూ మరియు అతిసారం పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవిద్య గారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని మరియు దోమతెరలను వాడాలని తెలియజేశారు. అతిసారం గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి మరియు చేతుల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ముజీబ్బాషా, ఆరోగ్య పర్యవేక్షకులు జే.సుధాకర, MLHPసౌజన్య, ఏ.ఎన్.ఎం. నిర్మల, సుజాత ఆశాలు పాల్గొన్నారు.

# మీ నేస్తం ఆధ్వర్యంలో రక్తదానం



రాయల్ జర్నలిజం రాయచోటి. జూలై 5: రాయచోటి పట్టణం లో ధ్వనివి నారాయణ హాస్పిటల్ లో రాయచోటి కి చెందిన మౌనిక 23 సం గర్భాని స్త్రీ హాస్పిటల్ చేరారు అకస్మాత్తుగా రక్తం అవసరమని డాక్టర్లు సూచించడంతో వెంటనే రాయచోటి మీ నేస్తం సేవా సంస్థ వ్యవస్థాపకుడు భూపతి యాదవ్ ను ఆమె బంధువులు సంప్రదించడంతో వెంటనే సాంబశివ అనే యువకుడిని పిలిపించి రక్తం అందజేశారు దీంతో ఆమెకు ప్రాణాపాయం తప్పినట్లు వ్యవస్థాపకుడు భూపతి యాదవ్ తెలిపారు తాము రక్తం అవసరమైన వారికి అన్నివేళలా ముందుండి తమ సంస్థ ద్వారా వీలైనంతవరకు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు రక్తదానం ప్రాణదానం తో సమానం అని యువకులు రక్తదానం చేయడం వల్ల ఇతరులకు ప్రాణదానం చేసినట్లు అవుతుందని ఈ విషయం గమనించి యువకులు రక్తదానం చేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో దీపా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సులోచన , నవిత లు పాల్గొన్నారు

# ప్రజలకు మెరుగైన విద్యుత్ అందించాలి



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) జులై 05 : రానున్న రోజులలో నియోజకవర్గంలోని ప్రజలకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేసే విధంగా విద్యుత్ శాఖ అధికారులు కృషి చేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. శుక్రవారం చీరాల బాపట్ల రహదరిలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవల అందించాలని, అనివార్య కారణాల రీత్యా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో సిబ్బంది తక్షణమే స్పందించి మరమ్మత్తులు చేసి విద్యుత్ అందించే విధంగా పనిచేయాలన్నారు. విద్యుత్ మొండి బకాయిలను వసూలు చేసి ఆదాయం పెంచాలని,నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులు శాఖపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఇప్పటికే పట్టణ ప్రాంతంలో పురపాలక సంఘం ద్వారా అందించే మంచినీటి కోసం అరగంటసేపు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని భవిష్యత్తులో అటువంటి సమస్య లేకుండా తాను పరిష్కారం చేస్తానని వివరించారు. ఎక్కడ కూడా విద్యుత్ చోర్యం లాంటివి జరగకుండా చూసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వాడుకునే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మీటర్లు ఇచ్చే విషయంలో గృహాల యజమానులను ఎవరిని ఇబ్బంది పెట్టొద్దని ఎవరినైనా ఇబ్బంది పెట్టారని నా దృష్టికి వస్తే సహించేది లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ

## డి.పి.ఎమ్.ఓ.డాక్టర్ రియాజ్ బేగ్



రాయల్ జర్నలిజం, (రాయచోటి), జూన్ 5:జిల్లా కేంద్రంలోని రాయచోటి పట్టణం లోని పట్టణ ఆరోగ్య కేంద్రం రామాపురం లో మూడు రోజుల పాటు జిల్లాలోని వైద్యాధికారుల కు మరియు ఆయుష్మెన్ ఆరోగ్య మందిర్ లలో పని చేయుచున్న సమాజ ఆరోగ్య అధికారులకు నిర్వహిస్తున్న అసంక్రమిత వ్యాధులైన క్యాన్సర్ పై శిక్షణ కార్యమాన్ని అన్నమయ్య డి.పి.ఎమ్.ఓ (జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి) డాక్టర్ రియాజ్బేగ్ డి.ఎన్.ఎమ్.ఓ.డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తో కలసి పరిశీలించారు.ఈసందర్భం గా డాక్టర్ రియాజ్ బేగ్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో మరియు ఆరోగ్య కేంద్రాల్లో ఓ.పి.కి వచ్చిన రోగులలో క్యాన్సర్ కు గల గుర్తులు, లక్షణాలు ఎలా గుర్తించాలి, స్క్రీనింగ్ పరీక్షల కొరకు ఎక్కడకు రేఫేర్ చేయాలి, ఒకవేళ నిర్ధారణ ఐతే చికిత్స సంబంధించిన రోగులు సక్రమంగా మందులు వాడే విదంగా ఫోలో అప్ చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన వైద్యులు, సి.హెచ్.ఓ లతో శిక్షణ కార్యక్రమంలో మీరు ఏమి నేర్చుకున్నారు, మీకు ఎంత వరకు శిక్షణ విధి నిర్వహణ లో సహాయపడితుంది. శిక్షణ లో ఇంకా ఏమైనా మార్పులు అవసరం ఉందా అని వారిని అడిగి తెలుసుకున్నారు. డి.ఎన్.ఎమ్.ఓ. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 18 వ తేది నుండి ఆగస్టు 2 వరకు నిర్వహించే ఇంటింటి కుష్టు వ్యాధి గ్రస్థుల సర్వే ను విజయవంతం చేయాలని కోరారు. స్టాప్ డయేరియా మరియు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సావాలను నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించి వ్యాధుల వ్యాపి అరికట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో శిక్షకులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ నాజియా పాల్గొన్నారు.

# "తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా : సీనియర్ ఐఏఎస్ అధికారి సుదర్శన్ రెడ్డి"

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో సముచిత స్థానం..
- సొంత గ్రామమైన తిరుమలరెడ్డిపల్లిలో హర్షం..



మదనపల్లి.జులై 5 రాయల్ జార్నలిజం.అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం తిరుమలరెడ్డిపల్లికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సి. సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా నియమించింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా విధులు నిర్వహిస్తున్న వికాస్ రాజ్ ను ఎన్నికల సంఘం రిలీవ్ చేసింది. దీంతో ఆయన స్థానంలో తెలంగాణ ప్రభుత్వంలో ప్రస్తుతం జీఏడి సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న సుదర్శన్ రెడ్డిని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా నియమించింది. 2002 ఐఏఎస్ బ్యాచ్ కి చెందిన ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ట్రైనీ కలెక్టర్, సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహించారు. అదేవిధంగా 2014 నుండి 2019 వరకు ప్రస్తుత హర్యాన రాష్ట్ర గవర్నర్ గా విధులు నిర్వహిస్తున్న బండారు దత్తాత్రేయ కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు పర్సనల్ సెక్రటరీగా, అప్పుడు రక్షణ శాఖ మంత్రిగా ఉన్న ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సెక్రటరీగా పని చేశారు. ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ సెక్రటరీగా పని చేశారు. ఇప్పుడు ఎంతో కీలకమైన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా సుదర్శన్ రెడ్డిని కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈయన తండ్రి స్వర్గీయ సి. నారాయణరెడ్డి సర్పంచ్, వైస్ ఎంపీపీ, ఎంపీపీగా పనిచేశారు. సర్పంచ్ గా పెద్దకురపల్లె పంచాయతీని, ఎంపీపీగా రామసముద్రం మండలాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. దీంతో వీరి కుటుంబానికి రామసముద్రం మండలంలో మంచి గుర్తింపు ఉంది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా నియమితులు కావడంతో సుదర్శన్ రెడ్డి స్వగ్రామమైన తిరుమలరెడ్డిపల్లిలో ఆయన బంధువులు, స్నేహితులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తపరిచారు.

# సర్కాజీ షర్ఫుద్దీన్ సాహెబ్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



రాయల్ జర్నలిజం రాయచోటి జులై 5: రాయచోటి చెందిన మత గురువు, సర్కాజీ షర్ఫుద్దీన్ సాహెబ్ ఇటీవల గుండె సంబంధిత జబ్బుకు చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి పొందుచున్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో మత గురువు షర్ఫుద్దీన్ సాహెబ్ మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష తో కలసి వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ,ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసు కున్నారు.త్వరితగతిన ఆరోగ్య వంతుడవ్వాలని శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హారూన్ బాష , నియామత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిపట్టాల పంపిణీలో భారీగా అక్రమాలు

## విచారణ జరపాలని టీడీపీ డిమాండ్



కురబలకోట రాయల్ జర్నలిజం: కురబలకోట మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇంటి పట్టాలలో భారీగా అక్రమాలు జరిగాయని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తెట్టు రెడ్డిశేఖర్ ఆరోపించారు. మండలంలోని కంటేవారిపల్లె, అమ్మచెరువుమిట్ట, తెట్టు, శ్రీరాములవారిపల్లె, మోడల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఇంటిపట్టాలు పంపిణీ చేసి పక్కా గృహాలు మంజూరు చేశారని తెలిపారు. ఇందులో అర్హులకన్నా అనర్హులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు. పేదలకు ఉచితంగా ఇవ్వాల్సిన ఇంటిపట్టాలను వైసీపీ అనుచరులు అనర్హులకు అమ్ముకొని లక్షలాది రూపాయలు చేతులు మారిందన్నారు. కంటేవారిపల్లె, అమ్మచెరువుమిట్ట ప్రాంతాల్లో బహిరంగంగానే విక్రయాలు జరిగాయన్నారు. తెట్టులో చెరువు, స్మశానాలను సైతం ధ్వంసం చేసి ఒక్కో ప్లాటును రూ.30 వేల నుంచి రూ.50 వేలకు అనధికారికంగా విక్రయాలు జరిగాయని ఈ వ్యవహారాల్లో అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. అక్రమాల నిగ్గు తేల్చకపోతే రెవెన్యూ అధికారులపై కమిషనర్, సీసీఎల్ఏ, రెవెన్యూ మంత్రుల దృష్టికి సైతం తీసుకెళ్లనున్నట్లు స్పష్టం చేశారు. అదేవిధంగా ఉపాధిహామీలో దొంగబిల్లులతో స్వాహా జరిగిందని, డ్వాక్రాలో సభ్యులకు అందాల్సిన పథకాలు కొందరు బినామీ పేర్లతో పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నట్లు తెలిపారు. వీటితోపాటు గ్రామకంఠాలు, ప్రభుత్వ, బంజరు భూముల్లోని ఫలవృక్షాలను ఆనాదిగా పెత్తందారుల ఆధీనంలో ఉన్నాయని, వాటిని గుర్తించి బీసీ, దళిత, గిరిజన పేదలకు 2సి పట్టాలు పంపిణీ చేసేలా చూస్తామన్నారు. క్షేత్రస్థాయి అధికారుల్లో స్పందన లేకపోతే ఉన్నతస్థాయిలో పోరాటం చేసి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

# మెరుగైన భవిష్యత్తు నిర్మించడానికి! సహకార సంఘాలు పునాది లాంటివి

## సహకార సంఘాల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్




రాయల్ జర్నలిజం రాయచోటి, జూలై – 5: మెరుగైన భవిష్యత్తు నిర్మించడానికి సహకార సంఘాలు పునాది లాంటివని. జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈనెల 6న 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని. శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో అధికారులతో కలిసి అంతర్జాతీయ సహకార దినోత్సవం ప్రచార గోడపత్రికలను జేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఈ నెల 6న జిల్లాలో ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "సర్వ మానవాళి ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో సహకార సంఘాలు" అనే నినాదంతో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని జరుపుతున్నట్లు పేర్కొన్నారు. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అమలు చేయడానికి చర్యలను వేగవంతం చేయడం, స్థిరమైన భవిష్యత్తును నిర్మించడంలో ప్రస్తుత మరియు చారిత్రక సహకారాన్ని ప్రదర్శించడానికి సహకార సంస్థలకు అవకాశం ఉందన్నారు. సమాజంలో సామాజిక, ఆర్థిక మరియు పర్యావరణ ప్రభావాన్ని సృష్టించి సామర్థ్యాన్ని పెంపొందించడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని. మెరుగైన భవిష్యత్తు నిర్మించడానికి కార్యాచరణ ప్రణాళిక.రూపొందించుకుని ముందుకు వెళ్లాలని జేసి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి గురుప్రకాష్ రావు, జిఎస్డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, ప్రొద్దుటూరు సిటిసి ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, సహకార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా పని చేద్దాం



రాయల్ జర్నలిజం ( బాపట్ల) జూలై 05 : బాపట్ల జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ గా బాధ్యతలు స్వీకరించిన జె.వెంకట మురళి శుక్రవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కలెక్టర్ బంగళాలో మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు జిల్లాలోని పరిస్థితుల గురించి, శాంతి భద్రతలకు సంబంధించిన అంశాల గురించి కూలంకషంగా చర్చించుకున్నారు.

# శుక్రవారం ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గలమ్మ



రామసముద్రం. జూన్ 05 రాయల్ జర్నలిజం: రామసముద్రం మండలంలో పలు గ్రామాలలో శుక్రవారం అమావాస్య కావడంతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామసముద్రంలో దుర్గలమ్మ,శ్రీ వాసవి కన్యా పరమేశ్వరి అమ్మవారు, గంపన పల్లెలో వెలసి ఉన్న శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు, తిరుమల రెడ్ల పల్లెలోని మారెమ్మ అమ్మవారు, గుంతల పేటలో వెలసి ఉన్న శ్రీ చౌడేశ్వరి దేవి,గంగమ్మ, గుంత ఎంబాడి లో శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు,ఎర్రబోయినపల్లిలోని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆర్టిఐ ఇన్ఫర్మేషన్ కమిషనర్ కు ఆర్టిఐ పుస్తకం అందజేసిన వ్యవస్థాపక అధ్యక్షులు సుమిత్రానందన్

## రాష్ట్ర కమిటీ సభ్యులు కనకపుడి వెంకటేశ్వరరావు



మంగళగిరి ,జూలై 5 (రాయల్ జర్నలిజం): జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు కనకపుడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జై ఆంధ్ర జై భారత్ సమాచార హక్కు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బి హెచ్ సుమిత్రానందన్ ఆర్టిఐ ఇన్ఫర్మేషన్ కమిషనర్ కార్యాలయంలో ఇన్ఫర్మేషన్ కమిషనర్ రెహనా బేగం కి ఆర్ టి ఐ 2005 చట్టం పుస్తకం అందజేశారు అని తెలిపారు . . ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ కమిషనర్ దృష్టికి ఏ సమస్య తీసుకు వెళ్లినా వెంటనే స్పందించి ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తారని కొనియాడారు . ఈ చట్టంపై అవగాహనకై అధికారులకు సుమారు 200 పుస్తకాల పంపిణీ చేసామన్నారు .

# మూగజీవాలకు అందించే సేవలలో ఎట్టి పరిస్థితుల్లో లోపం ఉండరాదు



భీమవరం ,జూలై 5 (రాయల్ జర్నలిజం):మూగజీవాలకు అందించే సేవలలో ఎట్టి పరిస్థితుల్లో లోపం ఉండరాదని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు . శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ సి.నాగరాణి పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశమై ఆ శాఖలో కొనసాగుతున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నాగరాణి మాట్లాడుతూ మూగజీవాలకు ఉత్తమ సర్వీస్ ను అందించాలని, విధులను అంకితభావంతో నిర్వహించాలన్నారు. ఆసుపత్రుల పని వేళల్లో సిబ్బంది అందరూ కచ్చితంగా విధులకు హాజరు కావాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ సబ్జెక్టు నాకు ఎంతో ఇష్టమైనదని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. నా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. లైవ్ స్టాక్ సెన్సెస్ ప్రకారం జిల్లాలో 2,23,676 ఆవులు, గేదెలు, 61,569 గొర్రెలు, 43,04,397 మేకలు, పందులు, బాతులు, నాటు కోళ్లు, బాయిలర్, ఫారం కోళ్ళు ఉన్నాయన్నారు. జిల్లాలో వెటర్నరీ ఇన్స్టిట్యూషన్స్ 318 ఉన్నాయని తెలిపారు. కాలానగుణంగా వ్యాప్తి చెందే వ్యాధులకు క్యాలెండర్ ప్రకారం వాక్సినేషన్ అందించాలని సూచించారు. 31 సెంటర్లలో టాయి టలెట్స్ అవసరం ఉన్నాయని పశుసంవర్ధక శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలా హాస్పిటల్స్ మరమ్మత్తుల దశలో ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ నిధులు మంజూరుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసవర్ధక శాఖ అధికారి డా.కె మురలీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్లు డా.జవహర్ హుస్సేన్, డా.యల్.కె.సుధాకర్, డా.జి.జేసు రత్నం, టెక్నికల్ ఆఫీసరు నోయల్, సహాయ సంచాలకులు, ఏరియా పశు వైద్యశాలలో వైద్యాధికారులు, పాల్గొన్నారు.

# వనమహోత్సవం "నేటి మొక్కే రేపటి వృక్షం"




భీమవరం ,జూలై 5 (రాయల్ జర్నలిజం): జూలై 5 వనమహోత్సవం పురస్కరించుకొని భీమవరం పట్టణం పెదమేరం గ్రామంలో ఉన్న వెస్ట్ బెర్రీ హై స్కూల్ ల్లో వనమహోత్సవ వేడుకలు వారం రోజుల పాటు విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి. ప్రవీణ్ ఆదిత్యగారు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకుంటూ ఈనాడు మీరు నాటిన ఈ చిన్న విత్తనాలు రేపు మహావృక్షాలుగా మారి ప్రజలందరికీ ఆరోగ్య వాతావరణం సృష్టిస్తాయని, ఈ మీ ఆదర్శం మరి కొందరికి ఆదర్శంగా నిలుస్తుందని విద్యార్థులను అభినందిచారు. అలాగే వారి చేతులు మీదుగా మొక్కలను నాటి వారు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణం పై వారి నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సారా స్మిత ,పాఠశాల డైరెక్టర్ మహేష్ కుమారు కూడా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పర్యావరణ రక్షణకు తగిన చర్యలు తీసుకోవడం వలన భవిష్యత్తులో పర్యావరణ విపత్తుల నుండి తమని తాము రక్షించుకోవమే కాకుండా భావితరాలకు కూడా రక్షణ లభిస్తుంది అని విద్యార్థులకు తమ సందేశాన్ని అందించారు.

# జిల్లాలో కొనసాగుతున్న ఎన్.హెచ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి



భీమవరం ,జూలై 5 రాయల్ జర్నలిజం): పశ్చిమగోదావరి జిల్లాలో కొనసాగుతున్న ఎన్.హెచ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సంబంధిత అధికారులకు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ సి.నాగరాణి నేషనల్ హైవేస్ అధికారులతో సమావేశమై ఎన్ హెచ్ 165, ఎన్ హెచ్ 216 ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నాగరాణి మాట్లాడుతూ పామర్రు నుండి ఆకువీడు మీదుగా దిగమర్రు వరకు ఎన్ హెచ్ 165 నిర్మాణం 104 కిలోమీటర్లు కొనసాగుతుందన్నారు. పామర్రు నుండి ఆకివీడు వరకు 64 కిలోమీటర్ల పరిధిలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఆకివీడు నుండి భీమవరం మీదగా దిగమర్రు చేరుకునే 40 కిలోమీటర్ల రహదారిలో 17 కిలోమీటర్ల పరిధిలో పనులు చేపట్టాల్సిందన్నారు. ఇందు కొరకు భీమవరం బైపాస్ ప్రాంతంలోని ఆరు కిలోమీటర్ల పరిధిలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలని భీమవరం ఆర్డీవోకు జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే కత్తిపూడి నుండి ఒంగోలు ఎన్ హెచ్-216 నరసాపురం దిగమర్రు మీదగా లోసరి కలుపుతూ వెళ్లే మార్గం మధ్యలో మొగల్తూరు మండలం కాళీపట్నం వద్ద నేషనల్ హైవే ప్రాంతంలో సీపీజ్ అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఎన్ హెచ్ అధికారి వివరణ ఇస్తూ స్థానిక నివాస ప్రాంతాల నుండి సీపేజ్ వస్తున్నట్లు గమనించడం జరిగిందని తెలిపారు. స్థానిక గ్రామ ప్రజలతో గ్రామ సభను ఏర్పాటు చేసి పరిస్థితి వివరించి తదుపరి చర్యలను తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఎన్ హెచ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ఓ జె.ఉదయభాస్కరరావు, విజయవాడ నుండి ఆర్ అండ్ బి ఎస్.ఇ సత్యనారాయణ ఆర్ అండ్ బి ఎన్.హెచ్ ఇఇ సంజీవ రాయుడు, కాకినాడ నుండి ఎన్ హెచ్ సబ్ డివిజన్ డిప్యూటీ ఇఇ ఎల్.ఎస్.సుబ్రహ్మణ్యం, మోర్త్ సహాయం ఇంజనీర్లు ఎన్ వెంకటరత్నం, కె.పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ లక్ష్యాలను నిర్ణిత గడువులో పూర్తి చేసేందుకు నిబద్ధతతో పనిచేయాలి: కలెక్టర్




భీమవరం ,జూలై 5 (రాయల్ జర్నలిజం): రెవెన్యూ లక్ష్యాలను నిర్ణిత గడువులో పూర్తి చేసేందుకు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నాగరాణి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య సంయుక్తంగా వివిధ రెవెన్యూ అంశాలపై జిల్లాలోని తాహసిల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాలైన కోర్టు కేసులకు సంబంధించి సరైన రీతిలో డిస్పోజలను దాఖలు చేయాలన్నారు. కోర్టు కేసులు డిస్పోజల్ కు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజా సేవకులుగా ఉన్న మనం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, నిబద్ధతతో పనిచేసి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. భూసేకరణ, 22ఎ, కమ్యూనిటీ సర్టిఫికెట్ లు జారీ, మీ కోసం ఫిర్యాదుల పరిష్కారం, పట్టాల సబ్ డివిజన్ లు, పాస్ బుక్కులు జారీ, ఇంటింటికి రేషన్ పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి విషయంలోను అప్రమత్తంగా ఉండాలని , కొన్ని ఫైల్స్ లో జాప్యం ప్రజలకు అపోహను కలిగిస్తాయని, ఇటువంటివి వేరే సమస్యలకు దారితిస్తాయని తెలిపారు. కమ్యూనిటీ సర్టిఫికెట్ల జారీకి త్వరితగతిన విచారణ పూర్తి చేసే సర్టిఫికెట్లు జారీ వేగవంతం చేయాలన్నారు. అలాగే మీకోసం ఫిర్యాదులు నిర్ణీత గడువులోపుగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఇంటింటికి రేషన్ సరఫరా చేసే ఎండియుల ద్వారా ఈ నెలలో బియ్యం ఒక్కటి మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కందిపప్పు, పంచదార ఇటీవల గోడౌన్ ల పరిశీలనలో తూకం తగ్గుదల కారణంగా ప్రభుత్వం ప్రస్తుతానికి ఒక బియ్యాన్ని మాత్రమే పంపిణీకి ఆదేశించి యున్నారని తెలిపారు. ఎండియు వాహనాలలో తూనిక యంత్రాలు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా ఒకసారి తనిఖీ చేయాలన్నారు. తేడాలుంటే ఆ మిషన్ స్థానంలో వేరొక తూని యంత్రాన్ని మార్పుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, కలెక్టరేట్ సెక్షన్స్ సూపరింటెండెంట్ లు, డిప్యూటీ తాహాసిల్దార్ లు, తదితరులు పాల్గొన్నారు.

# జై ఆంధ్ర కమిటీ సభ్యుల పిల్లలకు ఎడ్యుకేషన్లో 50% రాయితీ కలిపించాలి

## జై ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు బి హెచ్ సుమిత్రానందన్



విజయవాడ,జూలై 5: జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు బి హెచ్ సుమిత్రానందన్ మాట్లాడుతూ ఈరోజు విజయవాడ కే ఎల్ యూనివర్సిటీ లో యాజమాన్యంతో మాట్లాడి జర్నలిస్టుల మాదిరి ఆర్.టి.ఐ కమిటీ సభ్యుల కు కూడా ఎడ్యుకేషన్లో 50 % రాయికి కల్పించాలని కోరగా యాజమాన్యం 10%పైన రాయితీ ఇస్తామని హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కనకపుడి వెంకటేశ్వరరావు మరియు జిల్లా అధ్యక్షులు డి వెంకటేశ్వరరావు నూతన జాతీయ కమిటీ సభ్యులు ఎస్ పూర్ణచంద్రరావు విద్యార్థి సంఘ నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ అధికారులకు ఆర్టిఐ 2005 పుస్తకాలు పంపిణీ



నందిగామ ,జూలై 5 (రాయల్ జర్నలిజం): టౌన్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ని జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం అడ్వైజరీ కమిటీ మెంబర్ కనకపుడి వెంకటేశ్వరరావు మరియు ఎన్టీఆర్ జిల్లా కమిటీ మెంబర్ మేకల యోనా కలిశారు . సమాచార హక్కు చట్టం పుస్తకము అందజేసినారు . వెంకటేశ్వరరావు ఏఈ ని విద్యుత్ సమస్య లపై ఆర్టిఐ 2005 సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం కోరారు . ఏఈ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై ఏ సమాచారం కోరిన అందజేస్తానని అన్నారు . ఆయా సమస్యలను తన పరిధిలోపు పరిష్కరించి ఉంటానని హామీ ఇచ్చినారు అని వెంకటేశ్వర రావు తెలిపారు . వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బొజ్జ గాని దెబ్బయ్య సేవలను కొనియాడారు . విద్యుత్ శాఖ సిబ్బంది ప్రియాంక ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .

# పాత్రికేయులకు రైల్వే పాసులు పునరుద్ధరించండి

- చిన్న పత్రికలకు కేంద్ర ప్రభుత్వ ప్రకటనలివ్వండి
- ఎంపీ పురంధ్రీశ్వరికి నిమ్మరాజు వినతి



విజయవాడ, జూలై 5: కరోనా కష్టకాలంలో రద్దయిన పాత్రికేయుల రైల్వే పాసుల పునరుద్ధరణకు కేంద్రంలో మీవంతుగా కృషి చేయాలని సీనియర్ పాత్రికేయుడు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి నిమ్మరాజు చలపతిరావు విజ్ఞప్తి చేశారు. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలిగా లోక్సభలో ప్రమాణ స్వీకారం అనంతరం ఢిల్లీ నుంచి విజయవాడ వచ్చిన మాజీ కేంద్ర మంత్రి శ్రీమతి దగ్గుబాటి పురంధ్రీశ్వరిని శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సరైన ఆదాయ వనరులు లేక రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పత్రికలనేకం కొట్టుమిట్టాడుతున్నాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. చిన్న, మధ్య తరహా పత్రికల మనుగడ కోసం ముఖ్యమైన సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రకటనలు జారీ చేసేలా చూడాలని ఎంపీ పురంధ్రీశ్వరిని నిమ్మరాజు కోరారు.

# అమలాపురం-రావులపాలెం రోడ్డుకు 630 కోట్లు మాంజూరు




కొత్తపేట ,జూలై 5 :డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాఅమలాపురం – – రావులపాలెం రోడ్డుకు కోసంఈ ప్రాజెక్ట్ కు 6 సంవత్సరాల క్రితమే అంకురార్పణం జరిగింది. తర్వాత ఏర్పడిన వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డుకు కార్యరూపం దాల్చలేదు. పెండింగ్ లో ఉన్న అమలాపురం నుంచి వయా బండారులంక మీదుగా రెండు లైన్ల రహదారిని ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్డు వెడల్పు చేసి కొత్త రోడ్డు వేయడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది అప్పటి ప్రాజెక్ట్ కు పూర్తి కాకపోవడంతో తాజాగా కేంద్ర ప్రభుత్వం 630 కోట్లు మాజురుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక టెండర్ ప్రక్రియ ముగియగానే పనులు వేగంగా ప్రారంభమవుతాయి అని తెలియపరచడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

# జిల్లాప్రజలకు సురక్షిత త్రాగు నీరు అందించాలి



రాయల్ జర్నలిజం ( బాపట్ల) జూలై 05 : బాపట్ల జిల్లా ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో 960 నివాస ప్రాంతాలు ఉండగా అందులో మూడు లక్షల 64 వేల 788 గృహాలలో ప్రజలు జీవనం సాగిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 184 మంచినీటి ట్యాంకులు ఉండగా నీటిమట్టం దిగువకు చేరుతోందన్నారు. కృష్ణ పశ్చిమ డెల్టా నుంచి నీటి విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పట్టణ ప్రాంతాలలో ట్యాంకుల నుంచి సరఫరా చేసే తాగునీరు శుద్ధికరించాలన్నారు. పంచాయతీల కింద 462 నీటి పథకాలు, జిల్లా పరిషత్ కింద 31 పథకాలు, సి పి డబ్ల్యూ ఎస్ పథకాలు మరో 25 ఉన్నాయన్నారు. వాటితో పాటు మరో 5,083 చేతిపంపులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. వర్షాకాల సీజన్లో అంటువ్యాధులు ప్రభలకుండా సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. నీటి కాలువలలో తూటికాడ, పూడికతీత పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. రూ 7.69 కోట్లతో 45 పనులు చేయడానికి అధికారికంగా ఆమోదం లభించిందన్నారు. ఈనెల ఆగస్టు 31 తేదీ వరకు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. 51 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, 8 సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, 12 అర్బన్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు,477 సచివాలయాలలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండగా ప్రజలకు మంచి వైద్యం అందాలన్నారు. జిల్లాలో 111 మంది వైద్యాధికారులు ఉండగా సిబ్బంది మంచి సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు కొరత లేకుండా చూడాలన్నారు. పంచాయితీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పంచాయతీలపై పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు క్రమసిక్షనతో పని చేయాలి



రాయల్ జర్నలిజం ( బాపట్ల) జూలై 05 : ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులంతా క్రమశిక్షణతో మెలగాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వెంకట మురళి కలెక్టరేట్ భవనంలోని కార్యాలయాలన్నీ శుక్రవారం తనిఖీ చేశారు. కలెక్టరేట్ భవన సముదాయంలో ఆయన కలియ తిరిగారు. ఉద్యోగులు చిత్తశుద్ధితో ఇష్టంగా పనిచేసినప్పుడే మంచి ఫలితాలు లభిస్తాయని కలెక్టర్ చెప్పారు. కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్స్ పని తీరు పరిశీలించారు. ఆయా విభాగాల పర్యవేక్షకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ ఐ సి సెంటర్, ఆర్ డి ఓ కార్యాలయం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరం, వీడియో కాన్ఫరెన్స్ హాల్, సిపిఓ, ల్యాండ్ అండ్ రికార్డ్స్, పౌర సరఫరాల శాఖ, పౌర సరఫరాల సంస్థ, గ్రామ వార్డు సచివాలయాల కోఆర్డినేషన్ విభాగాలను ఆయన పరిశీలించారు. పనికిరాని వ్యర్థాలను తక్షణమే తొలగించాలన్నారు. కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డీఓ జి రవీందర్, తదితరులలు ఉన్నారు.

# ఒకే వేదికపైకి సోనియా, రాహుల్, విజయమ్మ ? వైఎస్సార్ జయంతిపై ఉత్కంఠ...!

అమరావతి :ఏపీలో ఒకప్పుడు కాంగ్రెస్ ఎంపీగా ఉంటూ, వైఎస్సార్ మరణం తర్వాత ఆ పార్టీతో విభేదించి వేరు కుంపటి పెట్టుకుని అదే పార్టీని నామరూపాల్లేకుండా చేసేసిన వైఎస్ జగన్ సోదరి వైఎస్ షర్మిల ఇప్పుడు తండ్రి వైఎస్సార్ జయంతి వేడుకలకు సిద్ధమవుతున్నవారు. అంతే కాదు ఒకప్పుడు తన సోదరుడు వైఎస్ జగన్ ను, తల్లి విజయమ్మను అవమానించి పంపిన కాంగ్రెస్ పెద్దలను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. దీంతో విజయమ్మ ఇప్పుడు కాంగ్రెస్ పెద్దలతో వేదిక పంచుకోవాల్సిన పరిస్థితి. ఈ నెల 8న వైఎస్సార్ జయంతి వేడుకలను విజయవాడలో అట్టహాసంగా నిర్వహించేందుకు వైఎస్ షర్మిల సిద్ధమయ్యా రు. అయితే పీసీసీ అధ్యక్షురాలి హోదాలో ఉంటూ దీన్ని తన సొంత కార్యక్రమంలా నిర్వహిస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్న షర్మిల.. ఇవేవీ పట్టించుకోకుండా సోనియా, రాహుల్, సిద్ధరామయ్య, ఖర్గే సహా కాంగ్రెస్ పెద్దలందరినీ దీనికి ఆహ్వానించారు. వైఎస్సార్ బిడ్డగా తాను చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా పార్టీకి ఊపిరిలూదేందుకు షర్మిల ప్రయత్నిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ మార్క్ ఇక్కడ కనిపించడం లేదు. అయితే ఇదే వేదికపై కాంగ్రెస్ పెద్దలతో కలిసి చాలా కాలం తర్వాత షర్మిల తల్లి విజయమ్మ కనిపించబోతున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ తో విభేదించిన తన బిడ్డ వైఎస్ జగన్ తో కలిసి వేరు కుంపటి పెట్టేసిన విజయమ్మ.. అనంతరం కాంగ్రెస్ తన కుటుంబానికి తీవ్ర అన్యాయం చేసిందని పలు మార్లు విమర్శలు చేసారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలతో వేదిక పంచుకునేందుకు సిద్ధమవుతున్నవారు. తన బిడ్డ షర్మిల కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేపథ్యంలో విజయమ్మకు ఈ అనివార్య పరిస్థితి ఏర్పడుతోంది. అయితే సోనియా, రాహుల్ సహా కాంగ్రెస్ పెద్దల్లో ఎంత మంది ఈ కార్యక్రమానికి వస్తారో తెలియదు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన నేతలు హాజరయ్యే అవకాశాలు కనిపిం చడం లేదు. మరోవైపు సోదరుడు వైఎస్ జగన్ ను కూడా షర్మిల ఈ కార్యక్రమానికి ఆహ్వానించలేదు. దీంతో 8న జరిగే వైఎస్సార్ జయంతిలో ఎవరెవరు పాల్గొంటారు, ఏ మెసేజ్ ఇవ్వబోతున్నారనేది ఉత్కంఠగా మారుతోంది.

# కేంద్ర బడ్జెట్‌లో అమరావతికి స్పెషల్ గ్రాంట్?

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. దేశ రాజధానిలో ఆయన తీరిక లేకుండా గడుపుతున్నారు. రెండో రోజున పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఇతర ప్రయోజనాల గురించి వారితో చర్చించారు. ఈ సాయంత్రం ఆయన ఢిల్లీ నుంచి నేరుగా హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. తన ఢిల్లీ పర్యటన సందర్భంగా చంద్రబాబు ఇదివరకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన విషయం తెలిసిందే. ఏపీ పునర్విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయడం సహా వివిధ అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి చొరవ తీసుకోవడం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం బకాయిలను వెంటనే విడుదల చేయడం వంటి డిమాండ్లను మోదీ ముందు ఉంచారు. ఇప్పుడు తాజాగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, వైద్య- ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు చంద్రబాబు. ఆర్థికపరమైన అంశాలను నిర్మలా సీతారామన్‌కు వివరించారు. ప్రధాని మోదీతో జరిగిన భేటీ సందర్భంగా ప్రస్తావనకు వచ్చిన విషయాలనే దాదాపుగా ఆమెకూ వివరించారు. రాజధాని అమరావతి ప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి అవసరమైన నిధులను సత్వరమే విడుదల చేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్స్, ఫైనాన్షియల్ క్లస్టర్స్, ఎకనమిక్ కారిడార్‌లను



ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. దీనికి అవసరమైన ప్రోత్సాహకాలను ప్రకటించాలని సూచించారు. త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే మధ్యంతర బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి అవసరమైన ప్రత్యేక నిధులను పొందుపరచాలని ఈ సందర్భంగా చంద్రబాబు.. నిర్మల సీతారామన్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్ అభివృద్ధి కోసం అదనపు కేటాయింపులు చేయాలని కోరినట్లు చెబుతున్నారు. బుందేల్ ఖండ్ తరహాలో రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్యాకేజీతో పాటు దుగరాజపట్నం ఓడరేవును పూర్తి చేయడానికి తక్షణ నిధులను మంజూరు చేయాలని చంద్రబాబు వివరించారు.

# ఏపీ వాలంటీర్లకు కూటమి సర్కార్ మరో షాక్ ! తాజా ప్రతిపాదనలివే.. ?



అమరావతి: ఏపీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అమల్లోకి తెచ్చిన వాలంటీర్ల వ్యవస్థలో భారీ మార్పులు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం అంతర్గంతంగా కసరత్తు సాగుతోంది. ఎన్నికల హామీ మేరకు వాలంటీర్లకు ఇచ్చే జీతం 5 వేల నుంచి 10 వేలకు పెంచాల్సిన పరిస్థిది ఉంది. ఈ నేపథ్యంలో త్వరలో మార్పులు పూర్తి చేసి జీతాల పెంపుపై నిర్ణయం తీసుకునే దిశగా కూటమి సర్కార్ అడుగులేస్తోంది. రాష్ట్రంలో వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం నియమించిన వాలంటీర్లు 2.67 లక్షలు. వీరిలో దాదాపు లక్షకు పైగా ఇప్పటికే రాజీనామాలు చేసి వెళ్లిపోయారు. వీరిలో కొందరు తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. అయితే వీరి సంగతి ఏమో కానీ మిగిలిన వాలంటీర్లకు కూడా పని లేకుండా పోయింది. ఇప్పటికే ప్రభుత్వం వాలంటీర్లు లేకుండా సంక్షేమ పథకాలు అందుతాయన్న విషయాన్ని లబ్దిదారులకు చెప్పేందుకు సచివాలయ కార్యదర్శుల్ని వాడుకుంటోంది. ఈ నేపథ్యంలో ఉన్న వాలంటీర్ల పరిస్దితి అగమ్య గోచరంగా మారింది. ఇప్పుడు వాలంటీర్ల వ్యవస్థలో తగు మార్పులు చేసి వీరి జీతాల పెంపుపై ఫోకస్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం మొత్తం రాజీనామా చేసిన వాలంటీర్లతో కలిపి మొత్తం 2.67 లక్షల వాలంటీర్లను సగానికి సగం తగ్గించడంతో పాటు వీరికి అప్పగించే విధుల్లోనూ, వీరి పేర్లలోనూ మార్పులు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటివరకూ 50 ఇళ్లకో వాలంటీర్ ఉండగా.. ఇకపై 100 ఇళ్లకో వాలంటీర్ ఉండేలా చూస్తారు. అలాగే వాలంటీర్ల పేర్లను కూడా గ్రామ సేవక్, వార్డ్ సేవక్ గా మార్చబోతున్నట్లు తెలుస్తోంది. అలాగే ఇప్పటికే రాజీనామా చేసిన వారికి చాన్స్ లేనట్లేనని చెప్తున్నారు. 3 ఏళ్లు మాత్రమే ఉద్యోగం ఉండేలా నిబంధనలు పెట్టబోతున్నారు. వాలంటీర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని ఇప్పటికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా చెప్పిన నేపథ్యంలో ఈ మేరకు మార్పులు చేసి వీరి సేవల్ని వాడుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అంతరిక్షంలోనా..? అవరోధాల సుడిలోనా..? నాసా ఉచ్చులో వ్యోమగామి సునీతా విలియమ్స్

న్యూఢిల్లీ : బోయింగ్ సంస్థ స్టార్ లైనర్ వ్యోమనౌకను రూపొందించింది. కాగా ఇది మానవసహిత వ్యోమనౌక. జూన్ 5 ఈ వ్యోమ నౌక భారత సంతతికి చెందిన సునీత విలియమ్స్‌తోపాటుగా బుచ్ విల్మోర్‌తో అంతరిక్షానికి బయలుదేరింది. కాగా ఈ రోధసి యాత్ర ముందుగా 8 రోజులు అనుకున్నారు. అనంతరం యాత్ర గడువును పది రోజులకు పెంచారు. అయితే ఆ తరువాత వ్యోమనౌకలో తలెత్తిన సాంకేతిక కారణాల దృష్ట్యా మూడు వారులు గడుస్తున్నా నేటికీ వారు అంతరిక్షంలోనే ఉన్నారు.

**అంతరిక్ష యాత్రకు ఎన్ని ఆటంకాలు.. అన్నీ తెలిసీ సన్నాహాలు..**

నాసా యొక్క వాణిజ్య క్రూ ప్రోగ్రామ్‌లో భాగంగా బోయింగ్ సంస్థ తయారు చేసిన మానవసహిత స్టార్‌లైనర్ వ్యోమనౌకను టెస్ట్ చేయడానికి గత నెలలో ప్రముఖ ఆస్ట్రోనాట్స్ సునీత, బుచ్‌ను రోధసికి పంపడాని నాసా నిర్ణయించింది. అయితే స్పేస్‌క్రాఫ్ట్‌లో తలెత్తిన సమస్యల కారణంగా ఈ యాత్ర మూడు సార్లు వాయిదా పడింది. అయితే నాలుగోసారి మళ్లీ గగణతలానికి నాసా శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో వ్యోమ నౌక భూమిపై ఉన్నప్పుడే అందులో సాకేతిక సమస్యలను గుర్తించినా ఏంకాదులే అనే నిర్లక్ష్యంతో వ్యోమగాములను నాసా అంతరిక్షానికి పంపిందని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.

**పేలిన రష్యా ఉపగ్రహం.. రెండు నెలల ముందే హెచ్చరిక..**

మూలిగే నక్కపై తాటిపండు పడింది అన్నట్టుగా ముందే వ్యోమనౌకలో తలెత్తిన సాకేతిక సమస్యలు, హీలియం లీకేజ్ వంటి అవరోధాలతో సతమతమౌతున్న నాసాకు తాజాకా పేలిన రష్యా ఉపగ్రహం తలనొప్పిగా మారింది. వాస్తవానికి అంతరిక్షంలోని రష్యా ఉపగ్రహం డెడ్ అయిందని, అది ఎప్పుడైనా పేలొచ్చని దాదాపు రెండు నెలల క్రితమే రష్యా ప్రకటించింది. అయినా నాసా స్టార్‌లైనర్‌ను అంతరిక్షంలోకి పంపిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్‌తో ప్రయాణించిన వ్యోమనౌక స్పేస్ స్టేషన్‌ను చేరుకున్న తరువాత డెడ్ అయిన రష్యా ఉపగ్రహం పేలిపోయింది. దీనితో విలియమ్స్, బుచ్ విల్మోర్ కనీసం స్పేస్ సెంటర్ నుండి బయటకు వచ్చే



అవకాశం సైతం లేకుండాపోయినట్టు తెలుస్తోంది.

**ప్రామాదం అంచుల్లో వ్యోమగాములు..?**

ప్రస్తుతం ఇటు మీడియాలోనూ అటు సోషల్ మీడాయాలోనూ సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్ ప్రమాదంలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే ప్రస్తుతానికి తాము సురక్షితంగానే ఉన్నమాని, ఆహారం, నీరు అవసరవైన అన్ని వసతులు ఉన్నట్టు వ్యోమగాములు నుండి సమాచారం అందినట్టు నాసా తెలిపింది. అయితే వాళ్లను భూమిపైకి ఎప్పుడు తీసుకువస్తారు అనే అంశంపై నాసా స్పష్టత ఇవ్వలేదు.

**ప్రత్యామ్నాయం ఉన్న వెనకడుగు వేస్తుంది నాసా..**

వ్యోమగాముల ప్రాణమా..? ప్రతిష్టే ముఖ్యమా అంటే నాసా ప్రతిష్టే ముఖ్యం అని అంటుందని విశ్లేషకులు మండిపడుతున్నారు. ప్రస్తుతం అంతరిక్షంలో చిక్కుకున్న వ్యోమగాములని భూమికి తీసుకు వచ్చేందుకు ఇప్పటికే అంతరిక్షంలో ఉన్న స్పేస్ ఎక్స్‌ను ఉపయోగించుకోవచ్చు. కాని నాసా మాత్రం అందుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతానికి తమకు స్పేస్ ఎక్స్ అవసరం లేదని చెప్తున్నట్టు సమాచారం. ఏదేనా కారణాల చేత స్పేస్‌ఎక్స్ సాయం తీసుకుంటే ఎలన్‌మస్క్ ముందు తాము ఓడినట్టు అవుతుందని నాసా అభిప్రయపడుతుందని అందుకే వ్యోమగాములకు ప్రమాదం ముంచుకొస్తున్న నిమ్మకు నీరెత్తినట్టు ఉందని పలువురు నాసాపై మండిపడుతున్నారు.

# కృష్ణానదిపై భారీ వంతెన - శర వేగంగా పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణం



విజయవాడ : విజయవాడలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణం శర వేగంగా సాగుతోంది. చిన్నఅవుటపల్లి నుంచి సూరాయపాలెం వరకూ జరుగుతున్న పనులు తుది దశకు చేరుకున్నాయి. వెంకటపాలెం-కాజ మధ్య రోడ్డు నిర్మాణం పూర్తికావస్తోంది. సూరాయపాలెం వద్ద కృష్ణానదిపై భారీ వంతెనను నిర్మిస్తున్నారు. ఎన్‌హెచ్‌ఎఐ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సుమారు 3 కిలోమీటర్ల పొడవైన ఈ వంతెన చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ బైపాస్ పనులు పూర్తయితే విజయవాడలో ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. హైదరాబాద్, ఏలూరుల నుంచి గుంటూరు వైపు వచ్చే వాహనాలు విజయవాడ నగరంలోకి రాకుండా గొల్లపూడి మీదుగా కాజ వద్ద చెన్నై హైవేని చేరుకోవచ్చు. ఆయా నగరాల నుంచి తొందరగా రాజధాని అమరావతికి కూడా రాకపోకలు సాగించవచ్చు. చెన్నై హౌరా జాతీయ రహదారిపై విజయవాడ నడిబడ్డు మీదుగా రోజూ వేలాది లారీలు, ట్రక్కులు, భారీ వాహనాలుతో విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో సమస్యని తగ్గించేందుకు గుంటూరు జిల్లా కాజా, రాజధాని ప్రాంతం మీదుగా గొల్లపూడి నుంచి విజయవాడ శివారు చిన అవుటపల్లి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

# మంత్రిని కలిసిన కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

అమరావతి : కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, వర్కర్ల జెఎసి కోరింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను జెఎసి నాయకులు సచివాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఆప్కాస్, వివిధ శాఖలు, సంస్థల్లోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయాలని, ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్షా తదితర ప్రభుత్వ పథకాలు, సంస్థల్లోని అన్ని క్యాడర్ల ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరింది. '2014 జూన్ ముందు నుంచి వైద్యారోగ్యశాఖ స్కీమ్‌లలో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, 2వ ఏఎన్‌ఎం, ఇతర క్యాడర్ల పారా మెడికల్ సిబ్బందిని, వివిధ వైద్య విభాగాల్లో ఉద్యోగులు అందించిన సేవలను పరిగణించి వయో పరిమితిలిచ్చి రెగ్యులర్ చేయాలి. 2014 జూన్ తర్వాత ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, సమగ్రశిక్ష ఎన్‌హెచ్‌ఎం తదితర ప్రభుత్వ పథకాలు, మున్సిపల్, పంచాయతీ, యూనివర్సిటీలు, కెజిబివి, టిటిడి తదితర దేవస్థానాల్లో



పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేసేందుకు నిర్దిష్ట విధానాన్ని ప్రకటించాలి. రెగ్యులరైజేషన్‌లోగా అందరికీ చట్ట ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా గ్రాస్ శాలరీని చెల్లించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆరోగ్యబీమా అమలు చేయాలి. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి' అని పేర్కొంది. మంత్రులను కలిసిన వారిలో జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కోశాధికారి డి దయామణి, కార్యదర్శి జె సింహాచలం, బి విజరు, బాంధానిమతాన్, అనురాధ, బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ వాహనాలతో రూ. 1,500 కోట్ల నష్టం: మంత్రి నాదెండ్ల మనోహర్



అమరావతి: రేషన్ మాఫియాలో ప్రధాన భాగస్వాములు ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాల నిర్వాహకులేనని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ధ్వజమెత్తారు. గత వైకాపా ప్రభుత్వం గడప వద్దకే రేషన్ పేరుతో 9,260 వాహనాలు కొనుగోలు చేసి, పౌరసరఫరాల సంస్థకు రూ. 1,500 కోట్ల నష్టం కలిగించిందని పేర్కొన్నారు. ఎండీయూల ద్వారా రేషన్ పంపిణీపై చర్చించి, త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. రబీలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ. 1,000 కోట్లను ఆయన విజయవాడలోని పౌరసరఫరాల సంస్థ కమిషనరేట్‌లో గురువారం విడుదల చేశారు. గత వైకాపా ప్రభుత్వం రూ. 1,659 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించకుండా రైతుల్ని మోసం చేసిందన్నారు. వైకాపా పాలనలో పౌరసరఫరాల సంస్థ అప్పులు రూ. 36,300 కోట్లకు చేరాయని, అందులో రూ. 10,000 కోట్లను వచ్చే ఏడాది మార్చిలోగా తీర్చాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బ్యాంకులకు రూ. 2,000 కోట్లు చెల్లించామని చెప్పారు. రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేయాలని ఆలోచిస్తున్నామని తెలిపారు. ఖాళీ గోతాలకు చెల్లింపులు నిలిపివేశామని.. దీనిపై అధ్యయనం చేస్తున్నామన్నారు. రేషన్ బియ్యం మాఫియాలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కుటుంబ అవినీతి భారీగా ఉందని మనోహర్ మండిపడ్డారు. గత ప్రభుత్వంలో కాకినాడ పోర్టును అక్రమ బియ్యం ఎగుమతులకు అడ్డాగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ మాఫియాను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కాకినాడ పోర్టుకు సమీపంలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో రూ. 159 కోట్ల విలువైన 35,404 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని వివరించారు.

# పవన్ కాపాడిన కేసులో సంచలన నిజం

అమరావతి : పవన్ ఆదేశాలతో తేజస్విని అనే యువతి అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు ఛేదించిన సంగతి తెలిసిందే. గత ఏడాది అక్టోబర్ లో అదృశ్యమైన తేజస్వినిని పోలీసులు కశ్మీర్లో గుర్తించారు. ఆమె ప్రేమికుడు అంజాద్ ను విజయవాడ తీసుకొచ్చారు. యువతిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంజాద్ పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇక్కడితో కథ సుఖాంతం అయిందని అంతా భావించారు. కానీ ఈ ఘటనలో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. ఈ విషయాన్ని పోలీసులతో పాటు మీడియా సైతం పట్టించుకోకపోవడం విశేషం. తేజస్విని అదృశ్యమైంది విజయవాడలో. అక్కడ నుంచి విశాఖ వెళ్ళింది ఆ ప్రేమ జంట. అటు తరువాత హైదరాబాద్, ఆ తరువాత బెంగళూరు వెళ్లారు. అంతటితో ఆగకుండా ఢిల్లీకి మకాం మార్చారు. అక్కడి నుంచి కాశ్మీర్ వెళ్లిపోయారు. గత తొమ్మిది నెలలుగా అక్కడే గడుపుతున్నారు. కనీసం ఆమెకు ఫోన్ కూడా అందుబాటులో లేనంతగా బందీగా మార్చేశారు. అయితే ఈ మొత్తం ఎపిసోడ్ వెనుక అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. సాధారణంగా ప్రేమ జంట అంత దూరం వెళ్లేందుకు సాహసించరు. ఏదో హైదరాబాదు.. బెంగళూరు వెళ్తారు. కానీ ఏకంగా కశ్మీర్ వెళ్లడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఇతర ప్రాంతాల వారికి కాశ్మీర్లో చోటు ఉండదు. అక్కడ ఉండాలంటే సహేతుకమైన కారణం ఉండాలి. కేవలం 7500 రూపాయల జీతం కోసం హోటల్లో పనిచేసినట్లు అంజాద్ చెబుతున్నాడు. కానీ అది నమ్మశక్యం కాని విషయం. తరచూ సిమ్ కార్డులను కూడా మార్చడం అనుమానాలకు తావిస్తోంది. భీమవరానికి చెందిన తేజస్విని విజయవాడలోని పెద్దమ్మ ఇంట్లో ఉంటూ హోటల్ మేనేజ్మెంట్ కోర్సు చేస్తోంది. అదే కళాశాలలో అంజాద్ గతంలో చదువుకునేవాడు. ఈ నేపథ్యంలోనే దర్శన్ అనే యువకుడికి ఆ కాలేజీలో చేర్పించాడు. మరో యువతిని కూడా హోటల్ మేనేజ్మెంట్ కోర్సులో చేర్చాడు. అదే సమయంలో తేజస్విని చేరింది. తేజస్విని పెద్దగా లోకజ్ఞానం తెలియని యువతి. బెరుకుగా కనిపించేది. అంజాద్ దర్శన్ తో పాటు మరో యువతీ ద్వారా తేజస్వినిని ట్రాప్ చేశాడు. ఆమెతో పరిచయం పెంచుకున్నాడు.




పది రోజుల్లో మరింత దగ్గరయ్యాడు. ఓ రోజు లవ్ ప్రపోజ్ చేశాడు. కానీ అందుకు తేజస్విని అంగీకరించలేదు. దీంతో వెంటనే ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేశాడు. ప్రేమించకుంటే రైలు కిందపడి చనిపోతానని హెచ్చరించాడు. అందుకు నువ్వే కారణమని సూసైడ్ లెటర్ రాస్తానని కూడా చెప్పుకొచ్చాడు. తల్లిదండ్రులంటే భయపడే తేజస్విని అంజాద్ మాటలకు నమ్మి ఆయనతో వెళ్లేందుకు సిద్ధపడింది. పోలీసుల దర్యాప్తులో కూడా తేజస్విని ఇదే విషయాన్ని చెప్పుకొచ్చింది. అయితే ఈ కేసుకు సంబంధించి ఎన్నెన్నో అనుమానాలు ఉన్నాయి. లవ్ జిహాద్ తరహాలో ఈ ఘటన జరిగినట్లు పోలీసు వర్గాలు సైతం అనుమానిస్తున్నాయి. అప్పటివరకు అంజాద్ బెంగళూరులో ఉద్యోగం చేసుకునేవాడు. ప్రేమతో తేజస్విని తీసుకెళ్తే బెంగళూరు తీసుకెళ్లాలి. కానీ ముందుగా విశాఖ తీసుకెళ్లాడు. తరువాత హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ.. ఇలా స్థలాలను మార్చాడు. ఫోన్ నెంబర్లను సైతం మార్చాడు. చివరకు కాశ్మీర్ తీసుకెళ్లి 9 నెలల పాటు ఉంచాడు. కచ్చితంగా దీని వెనుక ఉగ్ర నీడలున్నట్టు అనుమానాలు ఉన్నాయి. గతంలో మహిళల అదృశ్యం వెనుక పవన్ పలు రకాల అనుమానాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు పవన్ చొరవతో అదృశ్యమైన యువతి కేసు మిస్టరీ వీడినా.. దాని వెనుక అనేక రకాల అనుమానాలు ఉండడం విశేషం. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ సమగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తే.. మరిన్ని సంచలన విషయాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ఉండలేనంటూ వెళ్ళిపోతానంటున్న వైసిపి నేత..!

అమరావతి :2024 ఎన్నికలలో భాగంగా చాలామంది వైసిపి నేతల రాజకీయ పరిస్థితి డైలమాలో పడింది. వైసీపీలో ఇద్దరు అన్నదమ్ములు సైతం ఒక వైసీపీ నేతకు చెక్ పెడుతున్నారు.ఇటీవలే ఎన్నికలలో గెలిచిన స్థానాల తమ్ముడు ఆధిపత్యం కొనసాగుతూ ఉంటే..2019 లో గెలిచిన నియోజకవర్గం లో అన్న పెత్తనం చేస్తున్నాడు. అన్నదమ్ముల రాజకీయ మధ్య నలిగిపోతున్న ఆ రాజకీయ నేత ఎవరు.. ఏ నియోజకవర్గము ఇప్పుడు చూద్దాం.మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు.. ప్రకాశం పాలిటిక్స్ లో పరిచయం చేయలేనటువంటి పేరు. ప్రజారాజ్యం పార్టీ నుంచి రాజకీయంగా ఎంట్రీ ఇచ్చి.. కాంగ్రెస్టిడిపి వంటి పార్టీలలో కూడా పనిచేసి వైసిపి పార్టీలోకి ఎంట్రి ఇచ్చారు. వైసీపీలో ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు.. ఇప్పుడు ఈయన పొలిటికల్ ఫ్యూచర్ హాట్ టాపిక్ గా మారింది. 2019 ఎన్నికలలో గిద్దలూరు నుంచి భారీ మెజారిటీతో గెలిచారు. 2024 ఎన్నికలలో నియోజవర్గంలో మారి మార్కాపురం నియోజకవర్గం నుంచి ఓడిపోయారు. ప్రస్తుతం ఈయన ఏ నియోజకవర్గపు బాధ్యతలలో ఉ న్నారా అర్థం కాలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రాతినిధ్యం వహించిన గిద్దలూరు నియోజకవర్గం లో మాజీ ఎమ్మెల్యేనాగార్జునరెడ్డి పెత్తనం చెలాయిస్తున్నారట.ఇటీవల పోటీ చేసి ఓడిపోయిన మార్కాపురంలో నాగార్జునరెడ్డి తమ్ముడు కృష్ణమోహన్ రెడ్డి ఆదిపత్య రాజకీయాలను నడుపుతున్నారట. ఈ రెండు నియోజకవర్గాల అన్నదమ్ముల పెత్తనం కనిపిస్తోందట. దీంతో అన్నా రాంబాబు పరిస్థితి ఎటు కదలలేని పరిస్థితిగా మారిపోయిందట. కాంట్రాక్టర్ గా పనిచేసిన అన్నా రాంబాబు మొదట 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు. ఆ ఏడాది గిద్దలూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో టిడిపి నుంచి పోటీ చేయగా.. ఓటమి పాలయ్యారు. 2019లో వైసీపీ పార్టీల చేరి భారీ మెజార్టీతో గెలిచారు. 2024 ఎన్నికలలో సొంత పార్టీతోపాటు ప్రజలలో కూడా ఈయన పైన వ్యతిరేకత మొదలయ్యిందట. వైసిపి నాయకులు వ్యతిరేకంగా కూటమి కట్టడంతో పాలిటిక్స్ చేయలేమంటూ చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయట. దీంతో వైసిపి నేతలు అన్నా రాంబాబుని తాడేపల్లికి పిలిపించి మరి సర్ది చెప్పడం జరిగింది. అయినా కూడా 2024 లో ఓడిపోయారు.

# ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు దుబాయ్ కంపెనీలు క్యూ



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అపారమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని అబుదాబికి చెందిన ఎం42 సంస్థ ప్రతినిధులకు వివరించామని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు.మంగళగిరి ఎపిఐఐసి టవర్స్ లోని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులతో గురువారం సమావేశమైన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశమున్న రంగాలపై జినోమిక్స్, పర్యావరణ మెడ్ టెక్, బయోటెక్ విభాగాల్లో అపారమైన అనుభవమున్న ఎంఎఫ్2 సంస్థతో ప్రాథమికంగా చర్చించామన్నారు.వ్యాపారపరంగా, సేవా పరంగా ఏపీలో ఉన్న అవకాశాల్ని సంస్థ ప్రతినిధులకు వివరించామన్నారు. ఏపీలో బల్క్ డ్రగ్ పార్క్ మొదటి స్థానంలో ఉన్నవిషయాన్ని, అలాగే సుమారు 170 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎపి మెడ్ టెక్ జోన్, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 3 ఎకనమిక్ జోన్లలో పెట్టుబడులు పెట్టేందుకు మెండుగా ఉన్న అవకాశాలపైనా వారితో చర్చించామన్నారు. అమరావతి ప్రాంతంలో హెల్త్ సిటీలో గానీ, ఎంపిక చేసిన 9 మునిసిపాలిటీల్లో హెల్త్ హబ్ లలో కూడా పెట్టుబడులు పెట్టేందుకు అవకాశముందని మంత్రి సత్యకుమార్ చెప్పారు.ఆసుపత్రుల నిర్మాణాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహాన్ని కనబర్చడమే కాకుండా ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చే సరికొత్త టెక్నాలజీ అయిన జీనోమ్ సీక్వెన్సీ గురించి ఈ సందర్భంగా ప్రస్తావనకొచ్చిందన్నారు. ఎకనమిక్ కారిడార్లు, మెడ్ టెక్ జోన్ లలో ఎంఎఫ్2 ప్రతినిధులు క్షేత్ర స్థాయి పర్యటన చేశాక సంబంధిత అధికారులతో కూలంకషంగా చర్చించిన మీదట తుది నివేదికను అందజేస్తారన్నారు. పలు దఫాలుగా సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యాక రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలాన్ని అందజేస్తామని సంస్థ ప్రతినిధులకు చెప్పామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తామని, అవసరమైన రాయితీల్ని కూడా ఇస్తామని మంత్రి తెలిపారు.

# ఈవీఎం ధ్వంసంపై జగన్ చేసిన కామెంట్స్ - ఈసీకి ఫిర్యాదు చేయనున్న టీడీపీ



అమరావతి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈవీఎం ధ్వంసంపై చేసిన వ్యాఖ్యలను కార్నర్ చేసే పనిలో టీడీపీ పడింది.సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ రోజు అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్వాయి గేటు పోలింగ్ బూత్లోకి వెళ్లి ఈవీఎంను ధ్వంసం చేశారు. ఈ కేసుతో పాటు మరికొన్ని కేసుల్లో అరెస్టు అయిన ఆయన ప్రస్తుతం నెల్లూరు జిల్లాలోని సెంట్రల్ జైల్లో ఉన్నారు. ఆయన్ను పరామర్శించేందుకు జైలుకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. ఈవీఎంలను ధ్వంసం చేయడం తప్పే కాదన్నట్లు ఆయన చేసిన వ్యాఖ్యలపై టీడీపీ, జనసేన నేతలు ఘాటుగా స్పందించడంతో పాటు ఈసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

**జగన్ ఏమన్నారంటే.?**

'గ్రామంలో ఉన్న ఎస్సీలు ఓటు వేసే పరిస్థితి లేకపోవడంతో, మా ఎమ్మెల్యే ఎస్పీకి ఫోన్ చేసినా స్పందన లేకపోయింది. సున్నితమైన ఏరియాలో ఉన్న ఆ బూత్లో కేవలం ఒక హోంగార్డును సెక్యూరిటీగా పెట్టారు. అక్కడ అన్యాయం జరుగుతుండడంతో ఎమ్మెల్యే లోపలికి వెళ్లి ఈవీఎం పగలగొట్టాడు. వైసీపీకే ఓట్లు పడుతుంటే ఎమ్మెల్యే వెళ్లి ఈవీఎంను పగలగొట్టాల్సిన అవసరం ఏముంది. అక్కడికి వెళ్లినప్పుడు జరుగుతున్న అన్యాయం చూశాడు కాబట్టే కదా ఈవీఎం పగలగొట్టాడు. ఈ కేసులో బెయిల్ కూడా వచ్చింది. ఇవాళ తను లోపల ఉంది ఈవీఎంను పగలగొట్టిన కేసులో కాదు' అని జగన్ జైలు బయట మీడియాతో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీతోపాటు జనసేన నాయకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.జగన్మోహన్ రెడ్డి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని, అందుకే ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జగన్మోహన్ రెడ్డిని తల్లి, చెల్లి దూరం పెట్టారని, ప్రజలు ఎందుకు ఈ భారం భరించడం అని భావిస్తున్నారన్నారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో 11 సీట్లు మాత్రమే ఇచ్చినట్లు విమర్శించారు. పులివెందుల ప్రజలు కూడా ఈ సైకోని ఎంత తొందరగా వదిలించుకుంటే, ఆ ప్రాంతానికి అంత మంచిదని అన్నారు. ఈవీఎం ధ్వంసం చేయడాన్ని సమర్ధించడం ఏమిటని..? టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. 'ఈవీఎం పగలగొట్టి హత్యాయత్నం చేస్తే తప్పు లేదా. ఐదేళ్లలో లెక్కకు మించి పాపాలు చేశారు. కాబట్టి ఈరోజు ఫలితం అనుభవిస్తున్నారు' అని మండిపడ్డారు. జగన్ చేసిన వ్యాఖ్యలపై జనసేన నేత నాగబాబు కూడా స్పందించారు. జగన్మోహన్ రెడ్డి ఏం మాట్లాడుతున్నారో అర్థమవుతుందా..? అని ప్రశ్నించారు. కోపం వచ్చి ఈవీఎంలు పగలగొట్టారా..? ఒకవేళ నిజంగా అన్యాయం జరుగుతుంటే..? అక్కడ పోలీస్ సిబ్బంది లేరా..? ఎన్నికల సిబ్బంది లేరా..? ఆర్వో లేరా..? అని ప్రశ్నించారు. తీరు మారకపోతే ఈసారి సింగిల్ డిజిట్ కట్టబెట్టడానికి ప్రజల సిద్ధంగా ఉంటారని హెచ్చరించారు.

**ఈసీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న టీడీపీ**

ఈవీఎం ధ్వంసం వ్యవహారంపై జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు టిడిపి సిద్ధమవుతోంది. ఒక పార్టీకి అధ్యక్షుడిగా ఉంటూ, మాజీ ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్ రెడ్డి ఈవీఎం ధ్వంసం చేయడానికి సమర్థించేలా చేసిన వ్యాఖ్యలను తీసి దృష్టికి తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో ఎన్నికల సంఘం అధికారులను కలిసి జగన్మోహన్ రెడ్డి మాట్లాడిన వీడియో క్లిప్పింగ్తో సహా ఫిర్యాదు చేయనున్నారు. ఎన్నికల సంఘ పనితీరును కించపరిచేలా జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయంటూ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫిర్యాదుపై ఈసీ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

# అర్ధరాత్రి బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ - కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు ఎమ్మెల్సీలు



హైదరాబాద్ : బీఆర్ఎస్కు బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగుర ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయించేశారు. గురువారం అర్ధరాత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు ఆ పార్టీలో చేరిపోయారు. ఇప్పుడు ఎమ్మెల్సీలు కూడా చేరివపోవడంతో ఆపార్టీ మరింత ఇరకాటంలో పడింది.తెలంగాణలో చరిత్ర రిపీట్ అవుతోంది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన పరిణామాలు ఇప్పుడు మళ్లీ చూస్తున్నాం. గత పదేళ్లలో చాలా మంది ప్రజాప్రతినిధులు వేరే పార్టీల్లో ఇమడ లేక కారు ఎక్కిన సంగతి ఇంకా గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు అలాంటి సీన్స్ మళ్లీ కనిపిస్తున్నాయి. అయితే ఇక్కడ సీన్ రివర్స్ అయింది. మొన్నటి వరకు ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్కు వెళ్లే వాళ్లు కనిపించారు. అధికారం మారేసరికి ఆ పార్టీలో ఉన్న వాళ్లంతా కాంగ్రెస్లో చేరిపోతున్నారు.ఎలాంటి హడావుడి లేదు. సైలెంట్గా ఎమ్మెల్సీలంతా రాత్రికి రాత్రే కేసీఆర్కు చేయిచ్చి కాంగ్రెస్కు షేక్ హ్యాండ్ ఇచ్చారు. అర్ధరాత్రి ఎమ్మెల్సీ భాను ప్రసాద్, బస్వరాజు సారయ్య. దండె విఠల్, ఎంఎస్ ప్రభాకర్, యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్, పార్టీ మారిన వారిలో ఉన్నారు. వీళ్లంతా ఒంటిగట సమయంలో హైదరాబాద్లో సీఎం రేవంత్, పార్టీ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కేసీఆర్కు టాటా చెప్పేసి కాంగ్రెస్కు జై కొట్టారు.ఈ చేరికల్లో రెవెన్యూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ఉన్నారు. ఆయనతోపాటు మాజీ మంత్రి సుదర్శన్రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఢిల్లీ నుంచి రేవంత్ రెడ్డి వచ్చీ రాగానే చేరికలు జరిగిపోయాయి. ఇప్పటికే ఆరుగురు శాసనసభ సభ్యులు కాంగ్రెస్లో చేరిపోయారు.

# తెలుగు రాష్ట్రాలకు కొత్తగా వందే భారత్ స్లీపర్ రైళ్లు.. చౌక ధరల్లోనే!



అమరావతి :దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన వందే భారత్ రైలు అభిమానులకు శుభవార్త తెలిపింది రైల్వే. వందే భారత్ విజయవంతమైన తర్వాత, రైల్వేలు త్వరలో ప్రజలకు వందే భారత్ స్లీపర్ కానుకగా ఇవ్వబోతున్నాయి.ఆగస్టు 15 నుంచి అనేక రూట్లలో వందే భారత్ స్లీపర్ రైళ్లను నడిపే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆగస్టు నుండి వందే భారత్ కొత్త స్లీపర్ సర్వీసులను ప్రారంభించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (%ాజ=%) అధికారులు తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైళ్లను ఏయే రూట్లలో నడవనున్నాయో తెలుసుకుందాం.

**వందే భారత్ ఈ మార్గాల్లో నడుస్తుందా?**

టైమ్స్ నివేదిక ప్రకారం, దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాచిగూడ %-% సికింద్రాబాద్ స్టేషన్ల నుండి వందే భారత్ స్లీపర్ రైళ్లను నడపాలని ప్రతిపాదించారు. కాచిగూడ-విశాఖపట్నం, కాచిగూడ-తిరుపతి, సికింద్రాబాద్-పుణె వంటి రద్దీ రూట్లలో కొత్త వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపాలని అధికారులు కోరుతున్నారు. కొత్త వందే భారత్ స్లీపర్ రైలులో 16 కోచ్‌లు ఉంటాయి. ఈ రైళ్లు రాత్రిపూట కూడా నడుస్తాయి. ఇందులో ఏసీ, నాన్ ఏసీ కోచ్‌లు ఉండనున్న సంగతి తెలిసిందే. టికెట్ ధరలు అందరికీ అందుబాటులో ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

**వందే భారత్ స్లీపర్ వేగం ఎలా ఉంటుంది?**

కొత్త వందే భారత్ స్లీపర్ గరిష్టంగా గంటకు 160 కిలోమీటర్ల వేగంతో నడిచే అవకాశం ఉంది. అలాగే దీని డిజైన్ దాదాపు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను పోలి ఉంటుంది. ఈ రైలులో మొత్తం 16 కోచ్‌లలో ప్రయాణికులకు 823 బెర్తులు ఉంటాయని చెబుతున్నారు. ఈ రైలులో ప్రయాణీకులకు విమానం లాంటి సౌకర్యాలు కల్పిస్తారు. భోజనం, తాగునీరు అందించేందుకు చిన్నగది ఉంటుంది. వెలుపలి భాగంలో ఆటోమేటిక్ డోర్, వాసన లేని టాయిలెట్ ఉంటాయి. ఈ రైలు కోచ్‌లు పూర్తిగా సౌండ్ ప్రూఫ్‌గా ఉంటాయి. ప్రయాణ సమయంలో ప్రయాణీకులకు మంచి నిద్ర కోసం సౌకర్యాన్ని అందిస్తాయి.

**త్వరలో వందే భారత్ మెట్రోను రైల్వే శాఖ ప్రారంభం**

సమీపంలోని నగరాలను కలుపుతూ వందే భారత్ మెట్రో సర్వీసును ప్రారంభించాలని రైల్వే శాఖ యోచిస్తోంది. ఈ రైళ్లు కాన్పూర్-లక్నో, ఢిల్లీ-మీరట్, ముంబై-లోనావాలా, వారణాసి-ప్రయాగ్‌రాజ్, పూరి-భువనేశ్వర్ మరియు ఆగ్రా-మధుర మధ్య నడిచే అవకాశం ఉంది. ఒక్కో కోచ్‌లో 250 మంది సులభంగా ప్రయాణించవచ్చని చెబుతున్నారు. వందే భారత్ మెట్రో రైలు ట్రయల్ రన్‌ను త్వరలో రైల్వే నిర్వహించనుంది.

# కేసీఆర్ కాదనుకున్న నాయకుడే. బీఆర్ఎస్ ను ఖతం చేస్తున్నాడా?



హైదరాబాద్ : కేసీఆర్ కాదు పో అన్నాడు. ఛీకొట్టాడు ఆఖరుకు కేటీఆర్ మాట్లాడిన లాభం లేదు. కేటీఆర్ మధ్యలో వచ్చి కేసీఆర్ కు సదరు నేతకు మధ్య రాయభారం నడిపాడు. కానీ, కేసీఆర్ మార్క్ ట్రీట్మెంట్ తో శపథం చేసి మరీ బయటకు వచ్చి, ఇప్పుడు బీఆరెఎస్ కు చుక్కలు చూపిస్తున్నాడు.సీఎం రేవంత్ వ్యూహాన్ని అమలు చేస్తూ బదులు తీర్చుకుంటున్నాడు.అవును ఆయనే మంత్రి పొంగులేటి. ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ గ్రూపు రాజకీయాలతో విసిగి, కేసీఆర్ అవమానాలతో బయటకు వచ్చారు. నీ ఎమ్మెల్యేలను ఖమ్మం జిల్లా నుండి అసెంబ్లీ గేటు తాకనివ్వను అంటూ ప్రచారం చేశారు. ఆర్థికంగా కాంగ్రెస్ నేతలకు అండగా ఉంటూ అన్నది చేసి చూపించారు. అంతటితో ఆగలేదు రేవంత్ రెడ్డి సర్కారులో బీఆర్ఎస్ కు నిద్రలేని రాత్రులను చూపిస్తున్నారు.బీఆర్ఎస్ నుండి ఏ ఎమ్మెల్యే పార్టీ మారినా, ఎమ్మెల్సీ పార్టీ మారినా సీనియర్ నేత కాంగ్రెస్ లోకి ఎవరొస్తున్నా సరే రేవంత్ రెడ్డితో పాటు ఉండేది పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అవును వ్యూహాలను పక్కాగా అమలు చేసి, బీఆర్ఎస్ కు తెలియకుండా జాగ్రత్తపడి నేతలతో సంప్రదింపులు చేసి, పార్టీలో చేరే వరకు దగ్గర ఉంటున్నారు.మా సారు పొంగులేటి విషయంలో ఆనాడు కాస్త వెనక్కి తగ్గి ఉంటే పొంగులేటి విషయంలో కేసీఆర్ కనీసం కేటీఆర్ మాట అయినా విని ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని బీఆర్ఎస్ క్యాడరే ఫీల్ అవుతుందంటే సీన్ అర్థం చేసుకోవచ్చు.

# ఇజ్రాయెల్ పైకి 200 రాకెట్లు



న్యూఢిల్లీ : ఇజ్రాయెల్ , లెబనాన్ లోని హెజ్‌బొల్లాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. గ్రూప్ సీనియర్ కమాండర్ మహమ్మద్ నామేహ్ నజీర్‌ను ఓ వైమానికి దాడిలో ఇజ్రాయెల్ హతమార్చిన విషయం తెలిసిందే.దీనికి ప్రతీకారంగా ఆ దేశ సైనిక స్థావరాలే లక్ష్యంగా 200 కు పైగా రాకెట్లు, 20 కి పైగా ఆత్మాహుతి డ్రోన్లు ప్రయోగించినట్టు హెజ్‌బొల్లా ప్రకటించింది. గాజాలో పోరు ప్రారంభమైన తరువాత ఈ గ్రూపు జరిపిన అతిపెద్ద దాడుల్లో ఇదీ ఒకటి.లెబనాన్ భూభాగం నుంచి కొన్ని రాకెట్లు ఇజ్రాయెల్ లోకి ప్రవేశించాయని, చాలా వాటిని కూల్చేసినట్టు టెల్ అవీవ్ తెలిపింది. హెజ్‌బొల్లా దాడుల తరువాత ఇజ్రాయెల్ సైన్యం కూడా దక్షిణ లెబనాన్ ప్రాంతంపై విరుచుకుపడింది. రామ్యేహ్, హూలా పట్టణాల్లోని ఆ గ్రూపు మిలిటరీ నిర్మాణాలపై పెద్ద ఎత్తున దాడులు జరిపినట్టు వెల్లడించింది. హూలా పై జరిపిన దాడిలో ఒకరు మృతి చెందినట్టు లెబనాన్ వార్తా సంస్థ వెల్లడించింది.

# మచిలీపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ.. రూ.60వేల కోట్లతో ఏర్పాటు



అమరావతి: మచిలీపట్నంలో రూ.60 వేల కోట్లతో భారత్ పెట్రోలియం రిఫైనరీ ఏర్పాటుకానుంది. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురితో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా మచిలీపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుచేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇది నాలుగేళ్లలో పూర్తవుతుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది. రిఫైనరీ ఏర్పాటుకు సుమారు 2-3 వేల ఎకరాల భూమి అవసర మని కేంద్ర మంత్రి సూచించగా.మచిలీపట్నంలో అందుబాటులో ఉందని, ఇంకా కావాలన్నా ఇస్తామని మచిలీపట్నం జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి వివరించారు. దీనిపై కేంద్రమంత్రి పురి, చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. మచిలీపట్నం అయితే అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందని.. రాజధానికి దగ్గరగా ఉండటంతో పాటు పోర్టు కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు. మచిలీపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని.. భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని బాలశౌరి వివరించారు.

# కేంద్రం సూపర్ స్కీం.. 5 వేల పెట్టుబడితో నెలకు 50 వేల ఆదాయం



అమరావతి: యువతలో ఉద్యోగాల కంటే వ్యాపారం చేయాలనే ఆలోచనే ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగమైతే నెల నెలా శాలరీ వస్తుంది. వ్యాపారం రిస్క్ తో కూడుకున్నది. అయినప్పటికీ బిజినెస్ కే ప్రియారిటీ ఇస్తున్నారు.సొంతంగా వ్యాపారం చేయాలనుకునే వారి సంఖ్య పెరుగుతున్నది. కొందరు పౌల్ట్రీ, డెయిరీ, ఫర్టిలైజర్ షాప్స్ ఇలా ఏదో ఒక వ్యాపారాన్ని ప్రారంభించాలని చూస్తున్నారు. మరి మీరు కూడా సొంతంగా వ్యాపారం చేయాలనుకుంటున్నారా? తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందాలని చూస్తున్నారా? అయితే మీకోసం కేంద్ర ప్రభుత్వం అందించే సూపర్ స్కీం అందుబాటులో ఉంది. ఈ స్కీంలో 5 వేల పెట్టుబడితో నెలకు 50 వేల ఆదాయం అందుకోవచ్చు.కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం వినూత్నమైన పథకాలను ప్రవేశపెడుతున్నది. ఆర్థిక భరోసా కల్పించేందుకు అవసరమైన పథకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నది. ఈ క్రమంలో మీరు తక్కువ పెట్టుబడితో లాభదాయకమైన వ్యాపారాన్ని చేయాలనుకుంటే ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి కేంద్రం బెస్ట్ ఆప్షన్ గా చెప్పవచ్చు. ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు అవసరమైన మందులను తక్కువ ధరలకు అందుబాటులో ఉంచాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. దేశంలో ఈ జన ఔషధి కేంద్రాల సంఖ్య పెరుగుతోంది. దేశంలోని యువత ఈ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. మరి ఈ కేంద్రం ఏర్పాటు చేయాలనుకుంటే ఏ అర్హతులు ఉండాలి. ఎలా అప్లై చేసుకోవాలి ఇప్పుడు తెలుసుకుందాం.ప్రధాన మంత్రి జనౌషధి కేంద్రాన్ని ప్రారంభించాలనుకునే వారు డి. ఫార్మా లేదా బి. ఫార్మా సర్టిఫికేట్ కలిగి ఉండాలి. 120 చదరపు అడుగుల స్థలం ఉండాలి. దరఖాస్తు చేసుకోవడానికి 5 వేలు చెల్లించాలి. ప్రధాన మంత్రి జనౌషధి కేంద్రాన్ని ప్రారంభించిన తర్వాత, ప్రభుత్వం ప్రోత్సాహక రూపంలో ఆర్థికసాయం అందజేస్తుంది. ఫర్నీచర్ కొనుగోలుకు రూ. 1.5 లక్షల వరకు సాయం అందిస్తున్నది. కంప్యూటర్, ప్రింటర్, స్కానర్, ఇంటర్నెట్ తదితరాల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తున్నది. 5 లక్షల వరకు లేదా గరిష్టంగా రూ. 15,000 వరకు నెలవారీ మందుల కొనుగోలుపై 15 శాతం ప్రోత్సాహకం అందిస్తుంది. జనౌషధి కేంద్రంలో మందుల విక్రయంపై మీకు 20 శాతం కమీషన్ లభిస్తుంది.

# False campaigns against Rahul Gandhi should be avoided



Royal journalism (Rayachoti) July 5 :"Ameer said that the leaders of the district Congress party should avoid spreading false propaganda against Rahul Gandhi by the BJP leaders who emerged from the RSS. Addressing a press conference held at his party office on Friday, he accused Prime Minister Modi of giving false information to the Parliament House. He said that this will tell who is in favor of the constitution and who is against it.He said that the RSS had said in 1950 that there is no Indianness in the constitution, no one can believe the words of BJP leaders who emerged from such an organization, and all the people are on the side of Rahul Gandhi and Rahul. Gandhi proved it in yesterday's election. Is it also a crime to say that those who claim to be Hindus and spread hatred, violence and lies 24 hours a day are not Hindus? He said that false propaganda is being spread among the people and it is better to avoid such propaganda.He said that the slogan given by Rahul Gandhi - "Daromat Daramat" has created a strong consciousness among the common people as well. Congress party leaders Khader Khan, Shaik Ameer Basha, Chan Basha, Shaik Noorullah, Saddam, Amjad Khan, Baba Sardar, Owayz and others participated in this program.

# India, Bangladesh prepare to renew Ganga treaty

